



● తెనాలి మండలం నేలపాడు వద్ద నీటమునిగిన వరి పైర్లు

ముసురు

● జిల్లా అంతటా వర్షాలు
● ఎడతెరిపిలేని వర్షంతో రైతుల్లో హర్షం



రేపల్లె : పెనుమూడి వద్ద వర్షాల కారణంగా నీటమునిగిన వెదపొలం

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, జూలై 19: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ముసురేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఈ సీజన్‌లో ఈ స్థాయిలో వర్షం పడటం ఇదే కావడంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. చిరువ్యాపారులు, రోడ్ల పై విక్రయాలతో జీవనం సాగించే వారు, కూలీలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాచర్ల మండలంలోని ఎత్తిపోతల జలపాతం జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు భారీ గా వచ్చి చేరడంతో 72 అడుగుల ఎత్తు నుంచి జా లువారుతున్న ఎత్తిపోతల జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. భారీ వర్షాలు కాకపోయినా ఎడతెరిపిలేని వర్షాలతో రైతుల్లో అనందం వెల్లువిరుస్తుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లో తట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని వారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కూడా మునిగి తటాకాలను తలపి స్తున్నాయి. దీంతో కొన్ని చోట్ల వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ వర్షాలు పల్నాడులో వివిధ పంటలకు జీవం పోశాయి. పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని, ఇప్పటికే వేసిన పత్తి పంటకు మేలు జరుగుతుందని రైతులు చెప్పారు. ఈ వర్షాలు నారుమళ్లకు ఊపిరిపోస్తే, డెల్టాలో పచ్చిరొట్ట సాగు చేసిన భూములకు దమ్ము చేసుకునేందుకు నీటి కొరతను తీర్చింది.

లంకల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొల్లూరులోని ముంపు ప్రాంతాల్లో బాపట్ల కలెక్టర్ పర్యటన

కొల్లూరు: భారీ వర్షాల వల్ల కృష్ణానదికి వరద ముంపు పొంచి ఉందని లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. శుక్రవారం ఆయన కొల్లూరు మం డలంలోని వరద ముంపు ప్రాం తాల్లో పర్య టించారు. తొలుత అర వింద వారధి వద్ద గండి పూడ్చివేత పనులను పరిశీలించారు. అనంతరం చిలుమూరులంక, సుగ్గునలంక గ్రామాల్లో పర్య టించారు. వరద తీవ్రతను బట్టి అధికారులు ఇచ్చే సూచనల మేరకు గ్రామాలను విడిచి పునరావాస కేంద్రాలకు తరలి రావాలని గ్రామస్తులకు తెలిపారు. కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమీక్షలో అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. వరద వల్ల ఒక్క ప్రాణనష్టం కూడా జరగకూడదన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వరద ముప్పును ఎదుర్కోవడానికి సిద్ధం కావాలన్నారు. వరద ప్రాంతాల్లో ప్రజలను కాపాడేందుకు 56 బోట్లు, 100 మంది గజ ఈతగాళ్లు, ఎన్‌డీపీఏ సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రకాశం బ్యారేజీకి 12 అడుగులకు మించితే నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. నీటి ప్రవాహంపై లంక గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు.



అరవింద వారధి వద్ద గండిపడిన ప్రదేశాన్ని చూస్తున్న కలెక్టర్ వెంకటరమణ

డెల్టాలో.. గుబులు

● ఇటు వర్షాలు.. అటు పట్టిసీమ నీరు ● వెద సాగు చేపట్టిన రైతుల్లో ఆందోళన

తెనాలి(ఆంధ్రజ్యోతి): ఒక పక్క పట్టిసీమ నీరు.. మరోపక్క వానలు డెల్టా రైతుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. వెద సాగుచేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. పుష్కలంగా నీరు ఉందని సాగుకు ఢోకా ఉండదనే ఆనందంలో మిగిలిన రైతులు ఉన్నారు. గత నాలుగేళ్లుగా జలాశయాల్లో నీరు అందుబాటులో లేకున్నా వైసీపీ సర్కారు పట్టిసీమను పట్టించుకోలేదు. అయితే ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టిసీమపై దృష్టిపెట్టి సకాలంలో మరమ్మతులు పూర్తిచేసి నీటిని విడుదల చేసింది. అదనుకు నీరు అందడంతో వ్యవసాయ పనులు పదిరోజుల నుంచే డెల్టాలో పలువురు రైతులు మొదలు పెట్టేశారు. దీనికితోడు అల్పపీడనం కారణంగా వదలకుండా వర్షం పడుతుండడంతో నీరు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చింది. పచ్చిరొట్ట వేసిన మొక్కలను దమ్ముచేయటానికి నీటికోసం ఎదురుచూడాల్సిన పనిలేకుండా చేలల్లోనే నీరు నిల్వ ఉండటంతో అంతా అనుకూలమైంది. వెద పద్ధతిలో విత్తులు నాటిన రైతులకు మాత్రం కష్టం వచ్చిపడింది. ప్రధానంగా వర్షాలకు ముందు విత్తు చల్లిన రైతులకు నిరాశే మిగిలింది. మొలకలు వచ్చిన చేలన్నీ నీట మునిగి ఉండటంతో పంట దెబ్బ తినిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్కువ ఖర్చుతో వరి సాగు చేద్దామని పలువురు రైతులు వెదసాగు ప్రారంభించారు. మొలకలు వచ్చినా పర్వాలేదనుకున్న సమయంలో వర్షం కొంపముంచిందంటూ రైతులు విలపిస్తున్నారు. ఈ నెలలో వెదచల్లిన చేలల్లోనూ నీరు నిల్వ ఉండటం, రెండు రోజులుగా నీరు బయటకు పోకపోవడంతో పైరు కుళ్లిపోతుందనేది రైతుల ఆందో ళన. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, పొన్నూరు, పెదకాకాని మండలాల్లో, అటు బాపట్ల జిల్లాలోని వేమూరు, అవమృత లూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో వెద సాగుకు వర్షం నష్టం కలిగించింది. విత్తు చల్లడానికి ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు రైతులు ఖర్చు చేయడంతో అదంతా కోల్పోవాల్సి వస్తుందనేది రైతుల ఆవేదన. ఇప్పటి వరకు పడిన వర్షం వల్ల చేలన్నీ చెరువులుగా మారిపోతే, ఈ వర్షం ఇంతటితో ఆగిపోతే కొంతవరకైనా బయటపడతామని రైతులు ఆశతో ఉన్నారు. అయితే ఇది మరింత ఉధృతం అవుతుందన్న వార్తలతో డెల్టా రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. సాగు పనులు మాత్రమే చేసిన రైతులకు మాత్రం ఏ ఇబ్బందీ లేదు. వర్షం తగ్గాక పనులకి అనుకూల వాతావరణం ఉంటుందన్న సంతోషంలో ఉన్నారు. వెద సాగు ప్రశ్నార్థకంగా మారింది.



● నకరికల్లు ఇందిరమ్మ కాలనీ రోడ్డు దుస్థితి

● విద్యుత్.. జాగ్రత్తలు

● సమస్యలపై కంట్రోల్ రూమ్ 9440817526
● వినియోగదారులకు అందుబాటులో టోల్ ఫ్రీ 1912

గుంటూరు: వర్షాల నేపథ్యంలో విద్యుత్ పరంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పరంగా నెలకొనే సమస్యలు, ప్రమాదాలకు సంబంధించి ప్రజలు, వినియోగదారుల కోసం కంట్రోల్ రూమ్‌కు 9440817526 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా టోల్ ఫ్రీ నెంబర్ 1912ను అం దుబాటులో ఉంచామన్నారు. ఏదైనా సమస్య, ప్రమాదానికి సంబంధించి ఆయా నెంబర్లకు ఫోన్ చేసి అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎక్కడైనా 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లు తెగిపడిపోయినా ప్రజలు వాటిని తాకరాదన్నారు. తడిచిన విద్యుత్ పోల్స్‌ను తాకవద్దని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు, శబ్దం వచ్చినా సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడైనా సరఫరాలో అంతరాయాలు తలెత్తినా, వైర్లు తెగిపడినా, ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద సాంకేతిక సమస్యలొచ్చినా మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే వరకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కృష్ణమ్మ పరుగులు


ఆల్‌మట్టి, తుంగభద్రలకు జలకళ

● శ్రీశైలానికి స్వల్పంగా వరద.. అదేస్థాయిలో దిగువకు
● సాగర్ పరిధిలో సాగుపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ	ప్రస్తుత నీటి నిల్వ	వస్తున్న వరద నీరు	విడుదల చేస్తున్న నీరు
	టీఎంసీలలో	టీఎంసీలలో	క్యూసెక్కుల్లో	క్యూసెక్కుల్లో
● ఆల్‌మట్టి	123.08	97.41	43,478	65,480
● నారాయణపూర్	33.31	30.56	65,801	70,931
● జూరాల	9.66	4.95	4,014	27,579
● తుంగభద్ర	105.78	55.97	1,06,723	592
● శ్రీశైలం	215.81	32.51	7,931	7,063
● నాగార్జున సాగర్	312.05	123.50	8,462	6,562
● పులిచింతల	45.77	0.74	154	50

నరసరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెడుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు నదిలో జలాశయాలకు వరద పోటెత్తుతోంది. దీంతో ఆయా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలతో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆలమట్టి, తుంగభద్ర, నారాయణపూర్, జూరాల జలాశయాలకు భారీగా వరద నీరు వస్తుంది. దీంతో అవి జలకళను సంతరించుకున్నాయి. ఆల్‌మట్టి జలాశయంలోకి శుక్రవారం 43,478 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. ఇది క్రమంగా లక్ష క్యూసెక్కులు దాటే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఆల్‌మట్టిలో 123.08 టీఎంసీలకు 97.41 టీఎంసీల నీరు చేరింది. ఆల్‌మట్టి డ్యామ్ గేట్లు తెరచి దిగువకు 65,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయానికి కూడా వరద నీరు వచ్చి చేరుతుంది. 1,06,723 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. తుంగభద్రలో 105.78 టీఎంసీలకు 55.97 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ఈ డ్యాంకు 65,801 క్యూసెక్కుల వరద వస్తోంది. నారాయణపూర్‌లో 33.13 టీఎంసీలకు 30.567 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక్కడ నుంచి దిగువకు 70,931 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల జలాశయంలో 9.66 టీఎంసీలకు 6.99 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల నుంచి 27,579 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయా జలాశయాలకు ఇదే ప్రవాహం కొనసాగితే శ్రీశైలం జలాశయానికి కూడా భారీగా వరద నీరు వస్తుందని అంచనా వేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు స్వల్పంగా వరద నీరు వస్తుండగా అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. 7,931 క్యూసెక్కుల నీరు వస్తుండగా 7,063 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 8,462 కూసెక్కుల నీరు వస్తుంది. తాగు నీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 6,562 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సాగర్ కుడి కాల్వ పరిధిలో సాగుపై అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



● ఆలమట్టి జలాశయం నుంచి దిగువకు వస్తున్న నీరు



మాచర్ల : జలకళతో ఎత్తిపోతల జలపాతం

పల్నాడులో.. 48 సెంమీ వర్షపాతం

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం వరకు 48.02 సెంమీ వర్షపాతం నమోదైంది. అమరావతి మండలంలో 40 మీమీ, మాచర్లలో 17 మీమీ, యడ్లపాడు 21.4, చిలకలూరిపేట 23.2, నాదెండ్ల 20.2, ముప్పాళ్ల 33.8, నరసరావుపేట 19.4, రొంపిచర్ల 35.4, నకరికల్లు 12.2, రాజుపాలెం 23.6, సత్తెనపల్లి 24.8, పెదకూరపాడు 17.4, క్రోసూరు 14.2, అచ్చంపేట 10.4, బెల్లంకొండ 18.6, దుర్గి 28.8, రెంటచింతల 12.6, గురజాల మండలంలో 10 మీమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

తహసీల్దార్లు.. వెనక్కు



● ఎన్నికల బదిలీ స్థానాల నుంచి నేడు రిలీవ్?
● గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 53 మంది బదిలీ

గుంటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లందరినీ వారి సొంత జిల్లాలకు పంపించేయాల్సిందిగా రెవెన్యూ శాఖ ఆదేశించింది. అయితే వారిని సొంత రెవెన్యూ డివిజన్లలో మాత్రం పోస్టింగ్ చేయొద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి ఆర్‌పీ సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎవరైతే ఎన్నికల విధుల కోసం ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చారో వారందరిని శని, ఆదివారాల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు రిలీవ్ చేయనున్నారు. అలానే ఎలక్షన్ డ్యూటీల కోసం ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు వచ్చే వారం కలెక్టరేట్లకు వచ్చి కలెక్టర్లకు రిపోర్ట్ చేయనున్నారు. అనంతరం వారికి మండలాలు, కలెక్టరేట్‌లు, డివిజన్ కార్యాలయాల్లో పోస్టింగ్‌లు కల్పించనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి 31న ఉమ్మడి గుంటూరు జిల్లాలో 62 మంది తహసీల్దార్లున్నారు. వారిలో అప్పటికి జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకోని వారు ఆరుగురు, ఉద్యోగ విరమణకు దగ్గరలో మరో ముగ్గురున్నారు. దాంతో ఈ తొమ్మిది మందిని ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే కొనసాగించి మిగతా 53 మందిని బదిలీ చేశారు. గుంటూరు జిల్లా నుంచి జీవీఎస్ ఫణీంద్ర బాబు(తాడికొండ),శ్రీకాంత్ కేదార్‌నాథ్ (పొన్నూరు), జీ సిద్ధార (ప్రత్తిపాడు), కే సాంబశివరావు(గుంటూరు పశ్చిమ), షేక్ మెహబూబ్ బాషా(పెదనందిపాడు), కే మల్లీశ్వరి(దుగ్గిరాల), జీ నాంచారయ్య (కొల్లిపర), డీ పద్మనాభుడు(ఫిరంగిపురం), కే రవిబాబు(తెనాలి), కే నాసరయ్య(వట్టిచెరుకూరు), కేశ్రీనివాసశర్మ(మేడికొండూరు), కే కల్యాణి (తుళ్లూరు), జే ప్రసాదరావు(కాకుమాను), ఎం నాగిరెడ్డి(తాడేపల్లి), కేఎస్ చక్రవర్తి(పిడుగురాళ్ల), జీ కరుణకుమార్(దాచేపల్లి), ఎం డానియేల్(గురజాల), జీ రమేష్‌కుమార్(దుర్గి), షేక్ మొహమ్మద్ హుస్సేన్ (మాచర్ల), బీవీఆర్‌సీహెచ్ ప్రసాద్(మాచవరం), కే పుల్లారావు (రెంటచింతల), జీ శ్రీనివాస్(కారంపూడి), ఎస్ దురేశ్వరరావు(బెల్లంకొండ), ఎస్ సురేష్(సత్తెనపల్లి), జీ విజయశ్రీ(అమరావతి), ఎండీ జియావుల్‌హక్ (క్రోసూరు), ఎం క్షమారాణి (పెదకూరపాడు), ఎం భవానీశంకర్ (ముప్పాళ్ల), పీ సునీత (రొంపిచర్ల), కే నగేష్(ఈపూరు), జీ సుజాత (చిలకలూరిపేట), ఏవీ రమణ(నాదెండ్ల), ఎస్ నాగమల్లేశ్వరరావు (యడ్లపాడు), జే మధు బాబు(నూజెండ్ల), బీ కిరణ్‌కుమార్ (వినుకొండ), సీహెచ్ పద్మాదేవి (అచ్చంపేట),ఏవీ సుధాకర్(బొల్లాపల్లి), టీ మస్తాన్ (సత్తెనపల్లి డీఏవో), ఆర్ యశోధ(పల్నాడు కలెక్టరేట్), కే సుజాత(బాపట్ల), పీ మెహర్‌కుమార్(అమర్తలూరు), డీ వెంకటేశ్వరరావు(భట్టిప్రోలు), బీ వెంకటేశ్వర్లు(చెరుకుపల్లి), ఏ శ్రీనివా సరావు(కొల్లూరు), డీ మల్లికార్జునరావు(రేపల్లె), కే రవికుమార్ (చుండూరు), డీ నాగరాజా రావు(వేమూరు), బీ సుశీల(కారంశపాడు), పీ సురేష్ బాబు(మార్టూరు)లు బదిలీపై వేరే జిల్లాలకు వెళ్లారు.

చంద్రబాబు ఆదేశాలతో ఉత్తర్వులు

బదిలీ అయిన తహసీల్దార్ల స్థానంలో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి తహసీల్దార్లు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చా రు. ఎన్నికల కోడ్ జూన్ 6నే ముగిసింది. అయితే ఈసీ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో వెనువెంటనే వారిని సొంత జిల్లాలకు పంపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. తహసీల్దార్లతో పాటు ఏపీ రెవెన్యూ సర్వీ సెస్ అసోసియేషన్ నేతలు కొద్ది రోజుల నుంచి ఉన్నతా ధికారులను కలుస్తూ తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపాలని వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు అంగీకరించి ఆదేశా లు ఇవ్వడంతో శుక్రవారం రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి ఉత్తర్వులు ఇచ్చారు.

వైసీపీ నేతల చెరలో ప్రభుత్వ భూములు

● ప్రభుత్వం మారినా దృష్టిపెట్టని అధికారులు

అద్దంకి, జూలై 19: అద్దంకిలో విలువైన ప్రభుత్వ స్థలాలు వైసీపీ కౌన్సిలర్‌లు, నేతలు ఆక్రమించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆక్రమించుకుని హస్తగతం చేసుకున్నారు. ప్రధానంగా ఎన్టీఆర్ నగర్ సమీపంలో ఊరచెరువులో సుమారు ఎకరం విస్తీర్ణంలో ఆక్రమించుకున్న వైసీపీ నేతలు దాన్ని ప్లాట్లుగా మార్చి అమ్మకాలు చేపట్టారు. కొద్ది మంది కొనుగోలు చేయగా మిగిలినవన్నీ వైసీపీ నేతల ఆధీనంలోనే ఉన్నాయి. ఊరచెరువు అభివృద్ధి పనులు చేపట్టే సమయంలోనే స్థానిక వైసీపీ నేతలు ముందస్తు ప్రణాళికతో తమ ఆక్రమణలకు వీలుగా చెరువు కట్టను దూరంగా జరిపి వేయించారు. ఇక 1 వ వార్డు పరిధిలో కూడా ప్రభుత్వ స్థలాలు వైసీపీ నేతల హస్తగతమైనట్లు ఆరోపణలున్నాయి. ఆర్‌వో ప్లాంట్ నిర్మాణం పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారన్న విమర్శలు వస్తున్నాయి. ఓ వైసీపీ మహిళా నేత నామ్ రోడ్డుకు అత్యంత సమీపంలో ఇప్పటికే పాగా వేసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆటోనగర్ సమీపంలో మున్సిపాలిటీకి స్వాధీనం చేసిన స్థలం అన్యాక్రాంతంలో స్థానిక వైసీపీ నేతల హస్త ఉంది. గోపాలపురం వద్ద, శింగరకొండపాలెం సమీపంలో అద్దంకి కొండ వద్ద కూడా యథేచ్ఛగా ఆక్రమణలు జరిగాయి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఆక్రమణల జోరు మరింత పెరిగింది.



అద్దంకి ఎన్‌టీఆర్ నగర్ సమీపంలో వైసీపీ నాయకుల ఆక్రమణలోని ఊరచెరువు

ఫిర్యాదులు.. పరిశీలనలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ఆక్రమణలపై టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఊర చెరువులో ఆక్రమణలను ఇటీవల చీరాల ఆర్డీవో పరిశీలించారు. అయినా స్థానిక అధికారులు ఆక్రమణల తొలగింపుపై ఇంకా దృష్టి పెట్టకపోవటం విమర్శలకు తావిస్తోంది.

అట్రాసిటీ కేసులకు ప్రాధాన్యమివ్వాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 19: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. అత్యాచార నిరోధక చట్టం జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. ఏదైన సంఘటన జరగగానే ప్రాథమిక విచారణ చేసి, నిబంధనలను అనుసరించి తక్షణమే చార్జిషీట్ వేయాలన్నారు. 47 కేసులకు నష్టపరిహారం అందించడానికి రికార్డులు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం 83 కేసులు విచారణలో ఉన్నాయన్నారు. అద్దంకి, గోవాడలో తక్షణమే శ్మశాన భూమి కేటాయించాలన్నారు.ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ బాధితులకు భరసా కల్పించి తక్షణమే సహాయ సహకారులు అందించేలా చూస్తామని తెలిపారు. ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకువస్తామన్నారు. అట్రాసిటీ బాధితులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. సమావేశంలో చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య, జిల్లా కమిటీ కన్వీనర్ జె.రాజాదేబోరా, సభ్యులు కట్టా శ్రీనివాసరావు, పి.ప్రసాదరావు, టి.సురేష్, జి.రాజారావు, జి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఆంధ్ర యూనివర్సిటీలో బీఎస్-ఎంఎస్



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) సహకారంతో నిర్వహిస్తున్న బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. మొదటి మూడేళ్లు ఆంధ్ర యూనివర్సిటీలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీటెక్ డిగ్రీ; బీటీహెచ్ నుంచి బీఎస్-ఎంఎస్ డిగ్రీ లభిస్తాయి. బీటీహెచ్‌లో నాలుగో ఏడాది పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఏయూ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి.

ప్రోగ్రామ్స్ వివరాలు

1. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్స్
2. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్;
3. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్;

అర్హతలు: ఏపీ ఇంటర్ బోర్డ్/సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ నుంచి మేథమెటిక్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీ సెట్ 2024/టీజీ ఈఏపీ సెట్ 2024/ ఏయూఈఈటీ 2024 స్కోర్ తప్పనిసరి. తెలుగు మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు టోఫెల్ 575/90 స్కోర్ ఉండాలి. లేదా ఐఈఎల్‌టీఎస్‌లో మొత్తమ్మీద 6.5, సెక్షనల్‌గా 5.5 గ్రేడ్‌కు తగ్గకుండా ఉండాలి.

ఎంపిక: జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను ఏపీ ఈఏపీ సెట్ 2024, టీజీ ఈఏపీ సెట్ 2024, ఏయూఈఈటీ 2024 స్కోర్ల ద్వారా అలాట్ చేస్తారు.

- **అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు:** రూ.4000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 23
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, internationalaffairs.au@gmail.com
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Mx7wZFHలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంటెక్ స్పాట్ అడ్మిషన్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ రౌండ్ అడ్మిషన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. మొత్తం 89 సీట్లు ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 26న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో నిర్దేశించిన ప్రకారం కనీసం 55 లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 26న ఉదయం తొమ్మిదిన్నరకు
- **వేదిక:** సీఈ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్, అడ్మిన్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్-500046.
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్‌ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్‌ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్‌ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌నకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. నెలకు రూ.2000ల స్టయిపెండ్ ఇస్తారు.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు; టీసీ; ఆధార్ కార్డ్; కమ్యూనిటీ సర్టిఫికెట్; అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in


నవ్య | చిత్రజ్యోతి

అరుదైన గౌరవం!

మెల్‌బోర్న్ వేదికగా జరిగే 'ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ 15వ ఎడిషన్‌కు హీరో రామ్‌చరణ్ అతిథిగా హాజరు కానున్నారు. ఇందులో బహూకరించే సినిమా అవార్డులకు తన స్టార్ పవర్‌ను జోడించడం ఆసక్తికరం. భారతీయ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అంబాసిడర్‌గా అవార్డ్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ 'మన భారతీయ చిత్రాల్లోని వైవిధ్యాన్ని, గొప్పదనాన్ని అంతర్జాతీయ వేదికగా వేడుక నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ వేడుకలో పాల్గొనే అవకాశం రావడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున నేను ప్రాతినిధ్యం వహించడం ఆనందం కలిగించే అంశం. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రముఖుల్ని, అభిమానుల్ని కలుసుకోవడానికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నాను' అన్నారు.



ఏజెంట్ జాన్ స్నో



నితిన్, శ్రీలీల జంటగా రూపుదిద్దుకుంటున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇందులో సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఏజెంట్ జాన్ స్నో పాత్రను పోషిస్తున్నారు. ఆయన అసలు పేరు జనార్థన్ సున్నిపెంట అయితే జాన్ స్నో గా మార్చుకోడం ఆసక్తికరం. శుక్రవారం రాజేంద్రప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. చిత్రంలో ఆయనది కీలకమైన పాత్ర అనీ, వినోదభరితంగా ఉంటుందని దర్శకుడు వెంకీ చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదలవుతుంది.

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో చల్లగాలులు పలకరిస్తుంటే కోర్టు కేసులు, పోలీసు విచారణలు, విడాకులు, వివరణల వార్తలతో చిత్రసీమ వేడెక్కింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమలు శుక్రవారం పలు వివాదాలతో వార్తల్లో నిలిచాయి.



వివాదం విచారణ వివరణ

వివాదం

రూ. పాతిక కోట్లకు పరువునష్టం దావా

'కల్కి 2898 ఏడీ' చిత్రానికి వచ్చిన వసూళ్లు అంతా ఫేక్ అనే వ్యాఖ్యలు చేసిన బాలీవుడ్ సినీ విమర్శకులు సుమిత్ కడేల్, రోహిత్ జైశ్వాల్‌పై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేసింది. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి' చిత్రం బాక్సాఫీసు దగ్గర సత్తా చాటుతోంది. ఇటీవలే రూ. వెయ్యికోట్ల క్లబ్‌లో చేరినట్లు వైజయంతి మూవీస్ ప్రకటించింది. అయితే ఇవన్నీ ఫేక్ కలెక్షన్‌లు అని సుమిత్, రోహిత్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. రూ. 800 కోట్లు వస్తే, రూ. వెయ్యి కోట్లు అని చెబుతున్నారని విమర్శించారు. దీంతో వైజయంతి మూవీస్ రంగంలోకి దిగింది. 'కలెక్షన్లు ఫేక్ అని మీకు ఎవరు చెప్పారు? మీ దగ్గర ఉన్న ఆధారాలే మిటో చూపించండి, లేదా రూ. 25 కోట్లు చెల్లించండి' అని నోటీసులు పంపింది. గతంలోనూ ఇలాగే సుమిత్, రోహిత్ ప్రభాస్ చిత్రాలను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు.

విడాకులు నిజమేనా?

అభిషేక్‌బచ్చన్, ఐశ్వర్యారాయ్ బచ్చన్ దంపతుల విడాకులు ఖాయమనే ప్రచారం కొన్నాళ్లుగా బాలీవుడ్ సర్కిళ్లలో విస్తృతంగా ప్రచారమవుతోంది. అయితే అభిషేక్‌బచ్చన్‌తో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఐశ్వర్య తాముకలిసే ఉన్నామంటూ చెప్పకనే చెప్పారు. అయినా ఆ ప్రచారం మాత్రం ఆగలేదు. ఇటీవలే అనంత్ అంబానీ పెళ్లికి సైతం వీరిద్దరూ విడివిడిగా రావడమే గాకుండా ఫొటోలు సైతం విడిగానే దిగారు. దీంతో మరోసారి వీరి విడాకుల వ్యవహారం వార్తల్లో నిలిచింది. ఇప్పుడు అభిషేక్‌బచ్చన్ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ విడాకుల పోస్టుకు లైక్ కొట్టారు. దీంతో వీరిద్దరూ విడిపోబోతున్నారు కాబట్టే అభిషేక్ ఆ పోస్టుకు లైక్ కొట్టాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రచయిత హీనా ఖండేల్‌వాలా షేర్ చేసిన ఆ పోస్ట్‌లో ఏముందంటే 'కొన్నిసార్లు జీవితం మనం అనుకున్నట్లు సాగదు. విడిపోవడం అనేది అనుకున్నంత సులభం కాదు. అయినా 50 ఏళ్లు దాటిన వారు కూడా రకరకాల కారణాలతో విడిపోతున్నారు. దశాబ్దాల పాటు కలసి బతికిన వారిని ఇప్పుడు విడిపోవడానికి పురికొల్పుతున్నది ఏమిటి' అనేది ఆ పోస్ట్ సారాంశం.



విచారణకు రాలేను

- రాజ్‌తరుణ్



రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య ప్రేమ వ్యవహారం కేసులో విచారణ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ నెల 18న విచారణకు హాజరవ్వాలని నార్సింగ్ పోలీసులు రాజ్‌తరుణ్‌కు నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన గైర్హాజరయ్యారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని, విచారణకు హాజరవ్వలేనని రాజ్‌తరుణ్ పోలీసులకు తన న్యాయవాది ద్వారా వివరణ పంపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు కొత్త సినిమా చిత్రీకరణ, ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండడమే అందుకు కారణమని పేర్కొన్నారు. దీంతో రాజ్‌తరుణ్‌కు మరోసారి నోటీసులు ఇచ్చి, అప్పటికీ విచారణకు హాజరవ్వకపోతే తదుపరి చర్యలు చేపట్టాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

వివరణ

చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి

- బన్నీవాసు

'ఏ కుటుంబంలో అయినా ఒకరు తీసుకున్న నిర్ణయాల వల్ల కొన్ని సమస్యలు వస్తాయి. ఇలాంటివి మామూలే. వచ్చిపోతుంటాయి. సమయం వచ్చినప్పుడు 'మేం అంతా ఒక్కటే' అని మెగా - అల్లు ఫ్యామిలీ చాటి చెబుతుంది' అన్నారు నిర్మాత బన్నీవాసు. శుక్రవారం ఆయన ఓ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్లు అర్జున్ గత ఎన్నికల్లో వైసీపీ నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్‌కు ప్రచారం చేయడం మెగా-అల్లు కుటుంబాల మధ్య విభేదాలకు దారి తీసిందనే ప్రచారం కొన్నాళ్లుగా జరుగుతోంది. ఇదే విషయాన్ని పాత్రికేయులు బన్నీవాస్‌ను అడగ్గా, ఆయన 'అవును' అని గానీ, 'కాదు' అని గానీ సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. పాత్రికేయుల ప్రశ్నకు సమాధానమిస్తూ 'అవన్నీ చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి' అనే అర్థం వచ్చేలా మాట్లాడారు. 'గడ్డు పరిస్థితుల్లో ఆ రెండు కుటుంబాలు ఒకరికి ఒకరు అండగా నిలిచాయి. ఏ కుటుంబంలో అయినా కొన్ని సార్లు చిన్న చిన్న గొడవలు వస్తుంటాయి. అంతమాత్రాన వారి అనుబంధం దెబ్బతిన్నట్లు కాదు. వాటినే హైలైట్ చేయడం మంచిది కాదు. నేను 20 ఏళ్లుగా మెగా-అల్లు ఫ్యామిలీని చూస్తున్నా. 'కుటుంబ సభ్యులందరూ కలసి ఉండాలని చిరంజీవి గారు ఎప్పుడూ కోరుకుంటారు. ప్రతి సంక్రాంతికి ఆయన కుటుంబ సభ్యులందరినీ తీసుకొని బెంగళూరు వెళ్తారు. మనమందరం ఒకటే అనే భావన కుటుంబ సభ్యుల్లో కలిగించాలనేదే ఆయన ఆలోచన' అని చెప్పారు.

క్షమాపణ

తప్పు చేశా... మన్నించండి

'హీరోయిన్ తమన్నా సాంగ్ ఉంటే చాలు... కథలో పస లేకపోయినా సినిమా హిట్టవుతుంది. ఇప్పుడు ప్రేక్షకుల అభిరుచి అలా తయారైంది' అంటూ ఓ ఇంటర్వ్యూలో తమిళ నటుడు పార్తీబన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దిగజారుడు వ్యాఖ్యలు చేశారంటూ కోలీవుడ్ చిత్ర పరిశ్రమ ఆయన తీరును తప్పుబట్టింది. దీంతో పార్తీబన్ క్షమాపణలు చెప్పారు. 'చిత్ర పరిశ్రమకు చెందిన అందరినీ నేను గౌరవిస్తాను. నటీనటులను తక్కువ చేసే ఆలోచన నాకు లేదు. నా మాటలు ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తే నన్ను క్షమించండి' అని పార్తీబన్ కోరారు. రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో తమన్నా ప్రత్యేకగీతంలో నర్తించారు. అలాగే ఆమె లీడ్‌రోల్ పోషించిన 'బాక్' చిత్రం కూడా మంచి వసూళ్లను సాధించింది. ఈ నేపథ్యంలో ఆ రెండు సినిమాలను దృష్టిలో ఉంచుకొనే పార్తీబన్ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు.



ఆయ్.. అందరినీ ఆకట్టుకుంటుంది



'ఆయ్.. అనే టైటిల్ పెడితే ఒక ప్రాంతానికే పరిమితం అవుతుందా అని అనుకున్నాం. కానీ కథ బాగుంటే అందరూ ఆదరిస్తారనే నమ్మకంతో ఫిక్స్ చేశాం. ఈ కథను ఓకే చేసిన హీరో నితిన్‌కు అభినందనలు. అంతా ఓకే అనుకున్న తర్వాత ఎన్టీఆర్‌కు ఫోన్ చేశాను. 'ఫస్ట్ డే వరకూ మనం పుష్ చేస్తాం. ఆ తర్వాత సినిమా బాగుంటేనే ఆడుతుంది. ఎవరి కష్టం వారిదే. కథ బాగుందని అంటున్నారు కనుక చేసేయ్యండి' అని ఆయన చెప్పారు. ఈ సినిమాలో వర్షం కోసమే రూ. కోటికి పైగా ఖర్చు పెట్టారు. సినిమా చూస్తే మనం నిజంగానే ఆ ఊళ్లోకి వెళ్లి వర్షంలో తడుస్తున్నట్లుగా అనిపిస్తుంది' అన్నారు అల్లు అరవింద్. ఆయన సమర్పణలో నార్నే నితిన్ హీరోగా బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన 'ఆయ్' చిత్రం థీమ్ సాంగ్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడారు. మంచి గోదావరి సినిమా తీశామనీ, స్నేహం గురించి ఇందులో చెప్పామనీ హీరో నార్నే నితిన్ చెప్పారు. ఈ సినిమా చూస్తుంటే నవ్వి నవ్వి బుగ్గలు నొప్పి పెడతాయని బన్నీ వాసు చెప్పారు. గోదావరి ప్రాంతాన్ని బేస్ చేసుకుని తీసిన సినిమాల్లో 'ఆయ్' బెస్ట్ అవుతుందని దర్శకుడు అంజి కె మణిపుత్ర చెప్పారు.

కొత్త ప్రపంచంలోకి తంగలాన్

తమిళ హీరో విక్రమ్ నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' విడుదల తేదీని ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా చెప్పారు. పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతి తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.




దివ్యాంగులు, అంగన్‌వాడీల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న లోకేశ్

ప్రజల విన్నపాలపై వారం వారం సమీక్ష

● శాఖలవారీగా విభజించి సమస్యల పరిష్కారానికి కృషి ● జోరు వానలోనూ 19వ రోజు ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

తాడేపల్లి, జూలై 19: మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్‌కు రాష్ట్రవ్యాప్తంగా అనూహ్య స్పందన లభిస్తోంది. మంగళగిరి నియోజకవర్గం నుండే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి అర్జీదారులు లోకేశ్‌ను కలిసి వినతిపత్రాలు అందిస్తున్నారు. లోకేశ్ వారి సమస్యలను ఆలకించి పరిష్కారాన్ని సూచిస్తున్న తీరు ప్రతిఒక్కరిని అబ్బురపరుస్తోంది. తమ సమస్యకు లోకేశ్ ద్వారా పరిష్కారం లభిస్తుందని అర్జీదారులు భరోసాగా తిరిగి వెళుతున్నారు. శుక్రవారం 19వ రోజు వర్షం పడుతున్నా అర్జీదారులు భారీగా విచ్చేసి లోకేశ్‌కు వినతిపత్రాలు అందించారు. వివిధ వర్గాల ప్రజలు, యూనియన్లు, దివ్యాంగులు వ్యక్తిగతంగా వచ్చిన అర్జీలను లోకేశ్ స్వీకరించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. శాఖలవారీగా అర్జీలను విభజించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అధికారులు, సిబ్బందికి తదనుగుణంగా ఆదేశాలు ఇచ్చారు. ఆయా విన్నపాల తీరుపై ప్రతివారం సమీక్షించి పరిష్కార చర్యలు తీసుకోనున్నట్టు లోకేశ్ వివరించారు.

అంగన్‌వాడీ పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించండి

తాడేపల్లిలోని కృష్ణనగర్ అంగన్‌వాడీ పాఠశాలకు స్థలం కేటాయించడంతోపాటు శాశ్వత భవనం నిర్మించాలని అంగన్‌వాడీలు డి.లీల ఆధ్వర్యంలో నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పక్షవాతంతో మంచానికే పరిమితమైన తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఉండవల్లికి చెందిన టీ షైనర్‌బాబు కోరారు. సివిల్ ఇంజనీరింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆత్మకూరుకు చెందిన సీహెచ్ కళ్యాణ్‌బాబు విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న 27వేల మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కార్మికులకు టెండర్లతో పనిలేకుండా మస్టర్ రోల్ ద్వారా కొనసాగించాలని, హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగభద్రత కల్పించాలని విన్నవించారు. కడప జిల్లా గోపవరం మండలం, రాచయ్యపేటకు తాగునీటి సౌకర్యంతోపాటు రోడ్లు నిర్మించాలని గ్రామ ప్రజలు కోరారు. కరోనాతో తమ ఆర్థిక పరిస్థితి దిగజారాయని ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎస్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం ద్వారా తీసుకున్న కార్ల రుణాలను రద్దుచేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లా కోటలోని ఎస్‌కేబీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యా సంస్థలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు కోరారు. పశువైద్యాధికారులకు అనుసంధాన కర్తలుగా ఉన్న పశు సఖీలను గత ప్రభుత్వం తొలగించిందని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏపీ రాష్ట్ర పశు సఖిలు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వాహనడ్రైవర్‌గా పనిచేస్తున్న తనకు గత ప్రభుత్వం కక్షపూరితంగా జీతం నిలిపివేసి ఉద్యోగం నుండి తొలగించిందని న్యాయం చేయాలని జీ రమేష్ కోరారు. పలువురు దివ్యాంగులు కుటుంబసభ్యులతో వచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో లోకేశ్‌కు విన్నవించారు. సమస్యలన్నీ విన్న లోకేశ్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో అల్లర్లు, అశాంతికి ప్రధాన కారకుడు జగన్‌రెడ్డి



ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, జూలై 19: రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, అశాంతికి ప్రధాన కారణం జగన్మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. పొన్నూరులో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండలో శవ రాజకీయాలు చేసి రాజకీయ లబ్ధిపొందేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతలను దెబ్బతీసి కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చటమే లక్ష్యంగా జగన్, వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచకపాలన అంతం కావాలనే ప్రజలు జగన్‌కు ప్రతిపక్ష హోదాకూడా లేకుండా చేశారన్నారు. జగన్ వ్యాఖ్యలు చూస్తే ఓటమి తర్వాత కూడా ఆయనలో ఇంకా అహంకారం తగ్గలేదని అర్థమవుతోందన్నారు. గతంలో తాము నిరసనలు చెప్పట్టాలన్నా, టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడులు, హత్యల విషయంలో పరామర్శించాలన్నా చంద్రబాబుతో సహా అందరిని అడ్డుకున్నారని గుర్తు చేశారు. పల్నాడులో వందలాది మందిపై దాడులు జరిగితే టీడీపీ నేతలను అడుగుపెట్టనివ్వలేదన్నారు. మాచర్లలో ఎన్నో అరాచకాలు సాగించి ఈవీఎంలను ధ్వంసం చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జగన్ వెనకేసుకురావడం ఆయన అరాచక మనస్తత్వానికి నిదర్శనమన్నారు. వినుకొండలో వైసీపీ కార్యకర్తలు దాడులు చేసుకుంటే దానిని టీడీపీకి అంటగట్టి శవ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకుల వేధింపులతో నరసాపురం ఎంపీడీవో కనిపించకుండా పోయారన్నారు. వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడు రౌడీషీటర్లు అందరినీ రెచ్చగొట్టి టీడీపీ నేతలపై దాడులు చేయించిన సంఘటనలు జగన్‌రెడ్డికి కనిపించలేదా అని ప్రశ్నించారు. సంబంధం లేని అంశాలను రాజకీయం చేసి అల్లర్లు సృష్టించి రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతియాలని జగన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలను కూటమి ప్రభుత్వం తిప్పికొట్టి శాంతిభద్రతలను కాపాడుతుందని నరేంద్ర స్పష్టంచేశారు.

ఎన్నాళ్లీ ఫేక్ బతుకు జగన్‌రెడ్డి...

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 19: ఎన్నాళ్లీ ఫేక్ బతుకు జగన్‌రెడ్డి, వ్యక్తిగత గొడవలతో జరిగిన హత్యకు రాజకీయరంగు సిగ్గుచేటని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. నిజంగా ప్రేముంటే ఇబ్రహీం, జల్లయ్య, చంద్రయ్య హత్యలు జరిగినప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సిగ్గుంటే కోడికత్తి కేసు, వివేకా హత్యల గురించి చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. వ్యక్తిగత కక్షలతో జరిగిన గొడవలకు రాజకీయరంగు పులిమి వీరంగం చేస్తున్న జగన్‌రెడ్డికి తన ఐదేళ్ల పాలనలో జరిగిన హత్యలు గుర్తుకు రాలేదా అని ఎద్దేవా చేశారు. సొంత బాబాయిని చంపి టీడీపీపై తప్పుడు ప్రచారం చేశాడని మండిపడ్డారు. ఇప్పుడు వినుకొండలో జరిగిన హత్యను కూడా టీడీపీపై నెట్టడానికి జగన్ సిగ్గుపడాలన్నారు. వైసీపీ హయాంలో హతుడు రషీద్, నిందితుడు జిలానీ మధ్య జరిగిన గొడవలపై నాడే చర్యలు తీసుకొని ఉంటే నేడు ఈ హత్య జరిగేది కాదన్నారు. నాడు జగన్‌రెడ్డి రౌడీలను ప్రోత్సహించి హత్యలు చేయించి ఇప్పుడు నీతులు చెబుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌రెడ్డి ఓటమిని జీర్ణించుకోలేక నిందలు, ఫేక్ ప్రచారాలకు దిగుతున్నారన్నారు. ఇలాంటి సిగ్గులేని రాజకీయాల్ని ప్రజలు సహించబోరని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో వందలాది మందిని వైసీపీ ముఠా హత్యలు చేస్తే ఎప్పుడూ బయటకు రాని జగన్ ఇప్పుడు శవరాజకీయాల కోసం మాత్రమే బయటకువచ్చారన్నారు. ఇలాంటి ఫేక్ రాజకీయం, ఫేక్ బతుకు అవసరమా జగన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

రాజకీయ రాక్షసత్వానికి చిరునామా వైసీపీనే

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 19: రాజకీయ రాక్షసత్వానికి చిరునామా వైసీపీనే అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. హత్యలు, దాడులు చెయ్యడం వైసీపీ నేతలు పేటెంట్ హక్కుగా భావిస్తారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వందలాది మంది టీడీపీ కార్యకర్తలను బలితీసుకుంది వాస్తవం కాదా అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముందుగా చంద్రయ్య, జల్లయ్యయాదవ్ కుటుంబాలకు సమాధానం చెప్పి పల్నాడు గడ్డపైకి వస్తే బాగుండేదన్నారు. శవ రాజకీయాలు చేయటం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తామంటే చూస్తూ ఊరుకోమన్నారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు జగన్‌మోహన్‌రెడ్డి మాటలు ఉన్నాయన్నారు. వైసీపీ నేతల తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఇకనైనా బుద్ధి తెచ్చుకొని పద్ధతులు మార్చుకోవాలన్నారు.

31న ఏఎన్‌యూ పీజీ సెట్

పెదకాకాని, జూలై 19: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెల్ఫ్ సపోర్ట్ కేటగిరి విభాగంలో 2024-25 విద్యా సంవత్సరానికి భర్తీ చేయనున్న ఎంఏ, ఎంఎస్‌సీ, ఎంకాం, ఎంఏ జర్నలిజం, ఎంఏ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఎంఎల్ఐఎస్‌సీ, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులకు ఈనెల 31వ తేదీన అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత శుక్రవారం తెలిపారు. ఈనెల 20వ తేదీన జరగాల్సిన పరీక్షను వాయిదా వేసి 31న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏదైనా కారణాలతో ఈ కేటగిరిలో దరఖాస్తు చేసుకోలేని వారు ఈ నెల 30వ తేదీలోగా పీజీ అడ్మిషన్ల కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూ.ఏసీ.ఇన్‌లో సంప్రదించాలని డాక్టర్ అనిత సూచించారు.

ఏఎన్‌యూ వీసీగా ప్రొఫెసర్ గంగాధరరావు బాధ్యతల స్వీకారం


వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు చేపడుతున్న ఆచార్య కంచర్ల గంగాధరం

పెదకాకాని, జూలై 19: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నూతన ఇన్‌ఛార్జి వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైస్ చాన్సలర్‌గా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యా విషయక, పరిశోధన, బోధనరంగాలను బలోపేతం చేసి యూనివర్సిటీ స్థాయిని పెంచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ గంగాధర్‌రావుకు అభినందనల వెల్లువ కురిసింది. ఉదయం నుంచి విశ్వవిద్యాలయ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య సంధ్యకోల్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ స్వరూపరాణి, ప్రొఫెసర్ సిద్దయ్య, ప్రొఫెసర్ జాన్సన్, ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ ప్రమీలరాణి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ కె.సునీత, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్‌మూర్తి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణలతో పాటు విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, వికాస అధ్యక్ష కార్యదర్శులు టి.అనిల్‌కుమార్, కావూరి శ్రీనివాసరావు, దినసరి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రాము, కోశాధికారి తెరిసా బాబు, కార్యవర్గసభ్యులు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతిశ్రీ, ఎంఎంఆర్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు పరిణతి చెందిన పౌరులుగా ఎదగాలి

● ఐక్యరాజ్యసమితి నమూనా సదస్సులో ఎంపీ లావు శ్రీకృష్ణ


సదస్సులో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, జూలై 19: భారతదేశం శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక, పరిశోధనారంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతూ, ఐక్యరాజ్యసమితిలో కీలక భూమిక పోషించే స్థాయికి ఎదుగుతుందన్నదని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం వివా స్కూల్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న మోడల్ యునైటెడ్ నేషన్ (ఐక్యరాజ్యసమితి నమూనా) కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణ మాట్లాడుతూ, సదస్సు నిర్వహణ వలన భావితరాల వారికి ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు తెలుస్తాయని, తద్వారా భావినాయకులుగా, పరిణతి చెందిన పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులను ఆయన అభినందించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లడుతూ 1945లో ఏర్పడిన ఐక్యరాజ్యసమితిలో 193 దేశాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. అందులో కీలకమైన భద్రతామండలిలో ఐదు దేశాలు మాత్రమే శాశ్వతసభ్యులుగా ఉన్నారని చెప్పారు. భద్రతామండలి సభ్యులను పెంచి దానిలో భారతదేశానికి శాశ్వత సభ్యత్వం కల్పించాలని విద్యార్థులు ఈ సదస్సులో చర్చించాలని సూచించారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ సదస్సులో తెలుగురాష్ట్రాలకు చెందిన వివిధ పాఠశాలల నుంచి 360మంది విద్యార్థులు పాల్గొని ఐక్యరాజ్యసమితిలో భాగమైన ప్రతినిధుల సభ, భద్రతమండలి, సచివాలయం, అంతర్జాతీయ న్యాయస్థానం, ఆర్థిక సాంఘీక మండలి సభ్యులుగా ఏర్పడి చర్చించనున్నారు. ఇంకా సదస్సులో జార్ఖండ్ రాష్ట్ర రిటైర్డ్ డీజీపీ మండవ విష్ణువర్ధన్‌రావు, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, డైరెక్టర్ ఎల్ కమాండర్ కె.ఎస్.రావు, ప్రిన్సిపాల్ సిహెచ్. సరళ, అధ్యాపకులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎంపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు

కృషి విజ్ఞాన కేంద్రానికి 50 ఎకరాల స్థలం కేటాయించాలి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, జూలై 19: జిల్లాలో కృషి విజ్ఞానకేంద్రం ఏర్పాటుకు కేంద్రప్రభుత్వ సంస్థ ఐసీఏఆర్‌కు ప్రతిపాదనలు పంపాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ కృషి విజ్ఞానకేంద్రం ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం కేటాయించాలని సూచించారు. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించే సంస్థలు జిల్లా నలుదిశలా ఏర్పాటుచేసేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. నకరికల్లు మండలంలో నెలకొల్పిన ఇండో-ఇజ్రాయెల్ వ్యవసాయ ప్రాజెక్టుకు కృషివిజ్ఞానకేంద్రం తోడైతే జిల్లాలోని రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత మెరుగ్గా అందించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా 50 ఎకరాల స్థలం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ అధికారులు ప్రమీలరాణి, ముకుందరావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కాంతారావు పాల్గొన్నారు.

జగన్ శవ రాజకీయాలు సిగ్గుచేటు

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ, పక్కన మక్కెన తదితరులు

వినుకొండ, జూలై 19: మాజీ సీఎం శవరాజకీయాలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి శుక్రవారం విలేకర్ల సమావేశం జీవీ మాట్లాడారు. ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవను జగన్ స్వార్థరాజకీయాల కోసం పార్టీలకు అంటకట్టడం సిగ్గుచేటన్నారు. గత సంవత్సర కాలంగా రషీద్, జిలానీల మధ్య గొడవలు జరుగుతుంటే అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సరైన చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు రషీద్ మరణించేవాడు కాదని, రషీద్ మరణానికి బ్రహ్మనాయుడే కారణమన్నారు. వీరిద్దరూ వైసీపీ పట్టణ పార్టీ ప్రెసిడెంట్ పీఎస్ ఖాన్ అనుచరులు కాదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో పల్నాడు జిల్లాలో వైసీపీ కార్యకర్తలు, నాయకుల వల్ల ఎంతోమంది మరణించారని ఏనాడైనా చంపినవారిపై కేసులు పెట్టారా.. మరణించిన వారిని జగన్ ఓదార్చారా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే నిందితుడిని ఇంట్రాగేషన్ చేయడం జరుగుతోందన్నారు. డిల్లీ వెళ్ళి ప్రధానిని, హోంమంత్రిని, రాష్ట్రపతిని కలిసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టమని ఏ ముఖం పెట్టుకుని డిమాండ్ చేస్తావని జగన్‌ని ఎద్దేవా చేశారు. ఏనాడైనా రాష్ట్రం కోసం పోలవరం పూర్తిచేయాలని, అమరావతి పూర్తి చేయాలని వెళ్ళావా అని జీవీ ప్రశ్నించారు. సీఎంగా ఉన్నప్పుడు తాడేపల్లి సమీపంలో ఆడబిడ్డను చంపితే చంపినవారిపై ఏమైనా చర్యలు తీసుకున్నావా అని జగన్‌ని ప్రశ్నించారు. వైసీపీ హయాంలోనే కదా రాష్ట్రంలో గంజాయి వాడకం విచ్చలవిడిగా పెరిగిందన్నారు. బాబాయి హత్యకేసును తేల్చలేని ఘనుడు జగన్ అని ఇలాంటి వ్యక్తి మాటలు నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. అధికారం కోల్పోవడంతో జగన్‌కు మతి భ్రమించిందన్నారు. ఇకనైనా శవ రాజకీయాలు చేయడం మానుకోకపోతే ఈ సారి ఎన్నికలలో సింగిల్ డిజిట్‌కే పరిమితమైతాడన్నారు. హంతకులు ఎంతటి వారైన ఖచ్చితంగా శిక్షిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా సిఎంగా చేసిన జగన్ ఎవరో రాసిన స్క్రిప్టు చదువుతూ మాట్లాడడం దురదృష్టకరం అన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే జానీ లాయర్ సిద్దయ్య,చికెన్ బాబు, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు సమీపంలో రోడ్డు ప్రమాదం

పల్నాడు జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారికి గాయాలు

గిద్దలూరు, జూలై 19: గిద్దలూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారికి గాయాల య్యాయి. గిద్దలూరు పట్టణానికి చెందిన డాక్టర్ బీవీ రంగారావు పల్నాడు జిల్లా వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల జిల్లా సమన్వయకర్తగా ఉన్నాడు. గురువారం పల్నాడు నుండి గిద్దలూరుకు కారులో బయలుదేరాడు. గిద్దలూరుకు 7 కిలోమీటర్ల దూరం లోని రాచర్ల మండలం చెర్లోపల్లి సమీపంలో 11గంటల సమయంలో కారు బోల్తాపడింది. ప్రమాదంలో డాక్టర్ బి.వి. రంగారావు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమికచికిత్స అనంతరం రంగారావును మెరుగైన వైద్యంకోసం కర్నూలుకు తరలించారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినోద్‌కుమార్

ఐదు కిలోల గంజాయి పట్టివేత

● నిందితుల అరెస్టు

మంగళగిరి సిటీ, జూలై 19: వేర్వేరు చోట్ల పోలీసులు దాడులు జరిపి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో అక్రమంగా గంజాయి కలిగివున్న ముగ్గురు యువకులను మంగళగిరి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వివరాలను అర్బన్ సీఐ డి.వినోద్‌కుమార్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన మాకిన అమర్ నాథ్, అంబటినగర్‌కు చెందిన కామినేని సాయికృష్ణ, చింతల హరీష్‌లు గంజాయికి బానిసలుగా మారారు. చెడు అలవాటునే వృత్తిగా మలచుకుని కొంత కాలంగా గంజాయి అక్రమరవాణా, అమ్మకా లకు పాల్పడుతున్నారు. విశాఖపట్నం, అరకు ప్రాంతా ల్లో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి మంగళగిరి తెస్తున్నారు. ఎయిమ్స్‌కి వెళ్లేమార్గంలో చెట్లపొదల మాటున గంజాయిని దాచి చిన్నచిన్న పొట్లాలుకట్టి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు, సిబ్బంది శుక్రవారం దాడిచేయగా మూడున్నర కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయిని సీజ్‌చేసి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ వినోద్ కుమార్ తెలిపారు.

● తాడేపల్లి టౌన్: తాడేపల్లి పరిధిలోని సీతానగరం పుష్కరఘాట్ల వద్ద గంజాయి విక్రయిస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో సీఐ కళ్యాణరాజు వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ ప్రతాప్‌కుమార్, సిబ్బందితో కలిసి సీతానగరం రైల్వేవంతెన వద్ద నిఘా ఉంచారు. బండిరెడ్డి నందు, అఖిల్, ఎ భార్గవ్‌లు చేతిలో సంచి పట్టుకొని నిలబడి కనబడగా ప్రశ్నించడంతో వారు పారిపోయే ప్రయత్నం చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా సదరు యువకులు వ్యసనాలకు అలవాటుపడి సులువు మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కొంతకాలంగా అరకు వ్యాలీ, చింతపల్లి పరిసర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి అమ్ముతున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ముగ్గురు నిందితులు కలిసి చింతపల్లి వెళ్లి అక్కడ చింతపల్లి శ్రీను అనే వ్యక్తి వద్ద కేజీ రూ.3వేల వంతున రెండు కేజీల గంజాయి తెచ్చారు. వాటిని చిన్న ప్యాకెట్లు చేసి విజయవాడ, మంగళగిరి, కృష్ణాకెనాల్‌లో పరిసర ప్రాంతాల్లో అమ్మి జల్సాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. నిందితుల నుండి 1.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇదే కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని సీఐ కళ్యాణ రాజు తెలిపారు.

ప్రైవేటు ట్రావెల్ బస్సు బోల్తా.. ఒకరు మృతి


నరేష్‌బాబు మృతదేహం

మాచర్ల రూరల్, జూలై 19: ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు బోల్తా పడడంతో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని విజయపురిసౌత్ ఎస్ టర్నింగ్ వద్ద జరిగింది. శుక్రవారం ఏపీ 39 యూజే 5401 నంబరు గల ప్రైవేటు ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి పోరుమామిళ్లకు బయలుదేరింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ బస్సు విజయపురిసౌత్ ఎస్ టర్నింగ్ వద్దకు చేరుకుంది. ఆ సమయంలో బస్సు అదుపు తప్పడంతో బోల్తాపడింది. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన కోయలగుంట నరేష్‌బాబు(34) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సులో ప్రయాణిస్తున్న మిగతా 25మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. నరేష్‌బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


సాయిరాం మృతదేహం

పొన్నూరుటౌన్, జూలై 19: మండల పరిధిలోని మునిపల్లె గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం విశాఖపట్నంకు చెందిన వడ్డేపల్లి సాయిరాం (35) పొన్నూరులో ఓ ప్రైవేటు బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా చేబ్రోలు వెళుతుండా మునిపల్లె గ్రామం వద్ద జీబీసీ రోడ్డుపై టాటా ఏస్ వాహనం సాయిరాం ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయిరాం సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ పరారైనట్లు స్థానికులు సమాచారం. ఈ వాహనం రేషన్ బియ్యం రవాణాకు వినియోగించే వాహనంగా స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై రూరల్ ఎస్సై బీ భార్గవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

34,045 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 28,227 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 34,045 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 13,635 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16500	334	10000	17000
నెంబరు. 5	10000	15000	నెంబరు. 5	10500	14000
273	10500	13000	273	12000	12000
341	8500	13500	341	9000	15000
4884	15500	15800	4884	9000	15000
సూపర్ 10	–	–	సూపర్ 10	11100	11100
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18200	తేజ	10000	18500
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	9000	13200
దేవనూరుడీలక్స్	10000	10500	దేవనూరుడీలక్స్	10000	10000
తెల్లకాయలు	4000	12000	తెల్లకాయలు	5000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, బృందం

ఖజానాను దోచుకున్న వైసీపీ పాలకులు

● మండల పరిషత్ కార్యాలయం అవినీతిమయం
● వైసీపీ ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు తీవ్ర ధ్వజం

కర్లపాలెం, జూలై 19 : బాపట్ల నియోజకవర్గంలోని గత పాలకులు ప్రతి సెగ్మెంట్‌లో అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకుండా ఆటంకం పర్చారని మండలంలోని నల్లమోతువారిపాలెం వైసీపీ ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో గత వైసీపీ పాలనపై దుమ్మెత్తి పోశారు. కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ కర్లపాలెం మండలం పరిషత్ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందన్నారు. ఎంపీటీసీలకు తెలియకుండా అధికారులు కోట్లరూపాయల బిల్లులు పెట్టుకొని అవినీతికి పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు చేశారు. కర్లపాలెం జగనన్న కాలనీలో పేదలకు అందజేసే ప్లాట్‌లలో చెరువులోని బురదను మెరకగా వేసి కోట్లరూపాయల ప్రభుత్వ సొమ్మును మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తన అనుచరులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. ప్రభుత్వ స్థలాన్ని పూడ్చటానికి ప్రభుత్వ స్థలాన్ని తవ్వి కోట్లరూపాయలు బిల్లులు చేసుకున్నవైనంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. పెదగొల్లపాలెం సచివాలయంలో పేదలైన దర్జీలకు ఇచ్చే సొమ్మును లక్షలలో కాజేస్తే ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. డ్వాక్రా మహిళల నగదును పెదగొల్లపాలెంలో సుమారు 50లక్షలకు పైగా మోసం చేస్తే అతనిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. మూడు సంవత్సరాలు నుంచి ఎంపీటీసీల ప్రమేయం లేకుండా మండలపరిషత్‌లో వాడుకున్న నిధులకు లెక్కలు చెప్పేవిధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రస్తుత ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను తాండ్ర సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ అంతా అవినీతిమయమని, గత పాలకులకు అధికారులు దోచిపెట్టారని ఎలాంటి లెక్కలు లేవని ఎంపీటీసీల అంతా సమావేశం నుంచి బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లారు. బాయ్‌కాట్ చేసిన వారిలో తాండ్ర సాంబశివరావుతో పాటు దొంతిబోయన లక్ష్మీ సామ్రాజ్యం, ఆసీఫ్ అలి, రాతంశెట్టి లక్ష్మణరావు, చీరాల పద్మావతి, ఫులుగు సుబ్బారెడ్డి, గొర్ల కమల, హైమావతి, బిందు నాగలక్ష్మి ఉన్నారు. అవీనితిపై త్వరలో కలెక్టర్‌ను కలవనున్నామని అన్నారు. కాగా 2023-2024 సంవత్సరిక లెక్కలలో వచ్చినవి 13కోట్ల63లక్షల93వేల612, ఖర్చులు 13కోట్ల 38లక్షల 57వేల 170, మిగులు 25లక్షల 36వేల 442రూపాయలుగా సమావేశంలో ఎంపీడీవో వివరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ వనజ, మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, బుల్లియ్య, అమీర్‌బేగ్, జడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై జర్నలిస్టుల ఆగ్రహం

● బాపట్లలో నిరసన... కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

బాపట్ల, జూలై 19 : మీడియా సంస్థల అధినేతలు, జర్నలిస్టులను కించపర్చే విధంగా రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను బాపట్ల జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బాపట్ల పాతబస్టాండ్‌లో శుక్రవారం బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్, బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ సభ్యులు సంయుక్తంగా వర్షంలో సైతం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్ళి అక్కడ నిరసన తెలియజేసి కలెక్టర్ జె.వెంకటమురళీకి వినతిపత్రం అందజేశారు. అనేక కేసులలో నిందితుడిగా ఉన్న విజయసాయిరెడ్డికి మీడియా యాజమాన్యాన్ని, జర్నలిస్టులను విమర్శించే అర్హతలేదన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఏమాత్రం స్పందించకపోవటాన్ని తప్పుపట్టారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు చూసి తీవ్రంగా ఖండిస్తున్నారని చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య అన్నారు. అసోసియేషన్ నాయకులు బి.ధనరాజు, మురళీ, వెజెండ్ల శ్రీనివాసరావు, ఎస్‌కె.సుభానీ, ఎస్‌కె.బాషా, జంగం దాసు, ప్రసాద్, దీపక్, బత్తుల సురేష్, గణేష్, శ్రీకాంత్, పిండిమర కృష్ణ, మార్పు ఆనంద్, విన్నకోట శ్రీనివాసరావు, జోగి సువర్ణ, రాజారమేష్ పాల్గొన్నారు.



కలెక్టర్ జె.వెంకటమురళీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

బాపట్ల, జూలై 19 : నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెంలో ఈనెల 21వ తేదీన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని దళిత సంఘాల నాయకులు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం బాపట్ల మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేద్కర్ దంపతుల విగ్రహం వద్ద ఆవిష్కరించారు. దళిత నాయకుడు పల్నాటి శ్రీరాములు మాట్లాడుతూ సింహాసనంపై కూర్చొన్న అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన మనవడు ఆనంద్‌రాజ్ యశ్వంత్ అంబేద్కర్ ఆవిష్కరిస్తారన్నారు. అతిధులుగా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మీ, గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, దేవరకొండ రాము, తమలపాకుల భాస్కరరావు, సలగల చంటిబాబు, రవిరాజు, ఎస్ఎమ్ రాజు, నల్లమోతు శామ్యూల్ జాన్సన్, దయాబాబు, ఏలిసమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక సినీగీతాల రారాజు సముద్రాలు రాఘవచార్యులు : రావూరి

బాపట్ల, జూలై 19 : చలన చిత్ర పరిశ్రమలో అనేక చిత్రాలకు పాటలు రాసి పౌరాణిక సినీగీతాల రారాజుగా సముద్రాలు రాఘవచార్యులు వెలుగొందారని, ప్రాచీన, ఆధునిక గ్రంథాలు రచించి అద్భుతమైన సాహిత్యాన్ని సంపాదించారని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. సముద్రాలు రాఘవచార్యులు 122వ జయంతి కార్యక్రమంలో శుక్రవారం సాహితిభారతి ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, కోశాధికారి ఆదంషపి సంయుక్తంగా మాట్లాడుతూ భూకైలాస్, లవకుశ, సువర్ణసుందరి పాతచిత్రాలకు పాటలు, మాటలు రచయితగా వ్యవహరిచారని అన్నారు. సాహితిభారతి కార్యదర్శి కస్తూరి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, గౌరవ అధ్యక్షులు ఎం.జాకబ్ తదితరులు రాఘవచార్యులు చిత్రపటానికి నివాళులర్పించారు.



కర్లపాలెంలో రహదారి అస్తవ్యస్తంగా ఉన్న చిత్రం

అస్తవ్యస్త రహదారితో ప్రజల ఇక్కట్లు

కర్లపాలెం, జూలై 19 : మండల కేంద్రమైన కర్లపాలెం సెంటర్‌లో ఎన్‌హెచ్‌సీ ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉండటంతో మండల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి సక్రమంగా లేకపోవటంతో సెంటర్‌లో రహదారిపైకి వెళ్ళటానికి, కిందకు దిగటానికి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అనునిత్యం ద్విచక్ర వాహనదారులు రోడ్డెక్కే సమయంలో కిందపడి గాయాలపాలవుతున్నారు. నేషనల్ హైవే అధికారులు, ఆర్ అండ్ బీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా సక్రమంగా రహదారి నిర్మాణం చేయాలని ప్రజానీకం కోరుతున్నారు.

లంక గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

● వరద ముంపుపై అధికారులకు, ప్రజలకు సూచనలు



చిలుమూరులంకలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

కొల్లూరు, జూలై 19 : భారీ వర్షాల వల్ల కృష్ణానదికి వరద ముంపు పొంచి ఉందని, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటమురళీ సూచించారు. కొల్లూరు మండలంలోని వరద ముంపు ప్రాంతాలను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. తొలుత అరవింద వారధి వద్ద వరదల పడిన గండిని ఆయన పరిశీలించారు. గండి పూడ్చివేత పనుల గురించి ఆర్‌సి ఏఈ సురేష్‌ను ఆరా తీశారు. ఇటుక తయారీకి అవసరమైన మట్టి కోసం ఉత్పత్తిదారులు నది అంచు వరకు మట్టి తవ్వకాలు చేపట్టడం వల్ల గండ్లు పడుతున్నాయని ఆయనకు లంక గ్రామాల ప్రజలు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేసిన వారిపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామన్నారు. ఇకపై మట్టి తవ్వకాలు గురించి జాగ్రత్తగా ఉండాలని ఆర్‌సి ఏఈకి కలెక్టర్ సూచించారు. గండి పూడ్చివేత పనులపై కూడా అంచనాలు రూపొందిస్తామన్నారు. అక్కడ నుంచి చిలుమూరులంక, సుగ్గునలంక గ్రామాలకు వెళ్లి అక్కడ ప్రజలతో ఆయన మాట్లాడారు. వరద తీవ్రతను బట్టి అధికారులు మీకు సూచనలు చేస్తారని, ఆ సూచనల మేరకు ప్రజలంతా గ్రామాలను విడిచి పునరావాస కేంద్రాలకు తరలి రావాలన్నారు. లంక గ్రామాల్లో గర్భవతులు వివరాల కోసం ఐసిడిఎస్ అధికారుల గురించి కలెక్టర్ అడుగగా వారెవరూ అందుబాటులో లేకపోవడం గమనార్హం. అనంతరం కొల్లూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్, ఆర్‌సి, డ్రెయినేజీ అధికారులు విడివిడిగా కాకుండా సంయుక్తంగా సమన్వయంతో వరద సమయంలో పని చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ముందస్తుగానే వరద ముంపు గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వరద వల్ల ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకూడదని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వరద ముప్పును ఎదుర్కొవడానికి సంసిద్ధం కావాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే సమస్యలు తలెత్తకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు ఉంచుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో బ్లీచింగ్, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వరద విపత్తు నేపథ్యంలో అనుబంధ శాఖల అధికారులంతా అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుబ్బారావు, ఆర్డీవో హేలాషారోన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో లక్ష్మీకుమారి, ఆర్ఐ త్రివేణి, పశు సంవర్థక శాఖ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న రహదారిని పునః నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

దెబ్బతిన్న రహదారిని పునఃనిర్మించాలని కలెక్టర్ వెంకటమురళికి పెసర్లంక గ్రామస్తులు విన్నవించుకున్నారు. శుక్రవారం సాయంత్రం కొల్లూరు మండలంలోని వరద ముంపు ప్రాంతాలను పరిశీలించి తిరిగి వస్తుండగా గ్రామస్తులు కలెక్టర్ వాహనాన్ని ఆపి కొల్లూరు కరకట్ట నుంచి తమ గ్రామం వరకు ఉన్న రహదారి మొత్తం అధ్వానంగా ఉందని, పదేళ్ల నుంచి రహదారి మరమ్మతులకు నోచుకోలేదన్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ కూడా లేదని చెప్పారు. ఇసుక ఉచితం కాబట్టి నదిలోకి వెళ్లి తామే తెచ్చుకుంటామని కలెక్టర్‌ను కోరగా ప్రభుత్వ నిబంధనలు అందుకు విరుద్ధమని, స్టాక్ యార్డుల్లోకి వచ్చిన ఇసుకను వాహనదారులు, ప్రజలు తీసుకువెళ్లాల్సి ఉందన్నారు. కొల్లూరు నుంచి ఈపూరు పొలిమేర డొంక వరకు దెబ్బతిన్న కరకట్ట గురించి కూడా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లగా ఆ వివరాలను తనకు నివేదించాలని ఆర్ అండ్ బీ అధికారులకు కలెక్టర్ సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ తుషార్ డూడి



కలెక్టర్‌కి మొక్క అందజేస్తున్న ఎస్పీ

బాపట్ల,జూలై 19 : జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తుషార్ డూడి శుక్రవారం కలెక్టర్ జె.వెంకటమురళీని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు.

కలెక్టర్‌ను సత్కరించిన సమాజ్‌వాదిపార్టీ నాయకులు

బాపట్ల, జూలై 19 : కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జె.వెంకటమురళీని సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేడా శ్రీనివాసరావు పార్టీశ్రేణులతో శుక్రవారం కలిశారు. కలెక్టర్‌ను ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తుషార్ డూడిని కూడా కలిసి సత్కరించారు. అలాగే జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావును కూడా కలిసి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సమాజ్‌వాదిపార్టీ నాయకులు దాసరి శ్యామ్‌లివింగ్‌స్టన్, లంబు సాంబయ్య, మోర్ల చిన వెంకటేశ్వరరావు, కొండ్రు శరత్‌కుమార్, కొమ్మనబోయన ఫణేంద్ర, బోయన సూరిబాబు తదితరులు ఉన్నారు.

తాగునీటిని పరిశీలించిన కమిషనర్

బాపట్ల,జూలై 19 : పట్టణ ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. 9వ వార్డు మూర్తి రక్షణ్ నగర్ వద్ద గల ఫిల్టరేషన్ ప్లాంట్‌ను సందర్శించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. వాటర్ శాంపిల్స్ సేకరించి పరీక్షించారు. అనంతరం వాటర్ ట్యాంక్‌లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న షట్టర్లకు మరమ్మతులు చేయాలి

● బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు

బాపట్ల, జూలై 19 : తీరప్రాంత గ్రామాలకు సాగునీటిని అందించే ప్రధాన కాల్వ అయిన పిటి ఛానల్ షట్టర్‌లు మరమ్మతులు చేయటంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు అన్నారు. పార్టీశ్రేణులతో కలిసి షట్టర్‌లు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో 5 సంవత్సరాలు సాగునీటి కాల్వల మరమ్మతులపై ఏమాత్రం దృష్టిసారించలేదన్నారు. వెంటనే షట్టర్‌లు మరమ్మతులు చేయించి కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, తురిమేళ్ళ అమ్మేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : ఈఈ

బాపట్ల, జూలై 19 : విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల విద్యుత్ శాఖ ఈఈ ఆంజనేయులు తెలిపారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తడిచేతులతో విద్యుత్ వస్తువులను తాకరాదన్నారు. విద్యుత్ పోల్స్‌ను పట్టుకోవద్దు అన్నారు. తీగలు తెగి పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏడీఈ హరిశ్చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మశీలో రెండురోజుల ఎన్ఏఏసీ ఇన్‌స్పెక్షన్

బాపట్లరూరల్, జూలై 19 : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మశీ ప్రమాణాలను పరిశీలించటానికి అఖిల భారత స్వతంత్ర పర్యవేక్షణ సంస్థ తరుపున ఎన్ఎఎసీ పీర్ కమిటీ సభ్యులు డాక్టర్ గులానన్‌బనసల్, డాక్టర్ కెఇ రజన్, డాక్టర్ డి.భారతితో కూడిన త్రిసభ్య బృందం రెండురోజులపాటు కళాశాలలో సందర్శించి తమ నివేదికను కళాశాల ప్రిన్సిపాల్ టిఇజెకె మూర్తికి అందజేశారు. కాలేజి ప్రమాణాల పట్ల, సౌకర్యాలు, వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్రీలక్ష్మీ ఫౌల్ట్రీకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ

బాపట్లరూరల్,జూలై 19 : బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో కోడిగుడ్లు చిన్నవిగా ఉండటాన్ని కలెక్టర్ జె.వెంకటమురళీ స్వయంగా తనిఖీ చేసి గుర్తించారు. దీంతో పాఠశాలలకు కోడిగుడ్లను సరఫరా చేస్తున్న శ్రీలక్ష్మీ ఫౌల్ట్రీ, విజయనగరం సంస్థకు చిన్నసైజు కోడిగుడ్లు సరఫరా చేసి మధ్యాహ్న భోజనం పథకం నియమనిబంధనలను ఉల్లంఘించినట్లు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ నోటీసులు అందిన వెంటనే రెండు రోజులలో తగు వివరణ లిఖితపూర్వకంగా ఇవ్వాలని సంస్థకు ఆదేశాలు జారీ చేశారు.

వెంకటేశ్వరరావు మృతి టీడీపీకి తీరనిలోటు

బాపట్ల, జూలై 19 : తెలుగుదేశం పార్టీ నాయకుడు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటు అని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ అన్నారు. మండలంలోని నందిరాజుతోట గ్రామంలో వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని పార్టీశ్రేణులు సందర్శించి నివాళులు అర్పించి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కర్పూరపు రామారావు, పరీద్‌మస్తాన్, భీమా లీలాకృష్ణ, నూరగాని శేఖర్, కొల్లూరి వెంకట్రావు, దారా అశోక్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ ఉద్యోగి మృతికి సంతాపం

బాపట్ల, జూలై 19 : మండలంలోని నందిరాజుతోట గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ జంపాని శివబాబు కుమారుడు, మున్సిపల్ ఉద్యోగి జంపాని శివప్రసాద్ శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, టీడీపీ నాయకుడు తాతా జయప్రకాష్ నారాయణ, కందుల బాల కోటేశ్వరరావు, కర్రె మీరయ్య, పార్టీ మండల అధ్యక్షులు ముక్కామల శివ, జంపని చలమయ్య, కర్పూరపు రామారావు, గుడిపల్లి సాంబశివరావు, పరిశా రమేష్‌గౌడ్‌లు సందర్శించి పుష్పాంజలి ఘటించారు.

శ్రీబగళాముఖి అమ్మవారికి దాతలు వెండిపల్లెం అందజేత



దాతలు అందజేసిన వెండిపల్లెం

పిట్టలవానిపాలెం, జూలై 19 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారికి చౌడిపాలెం గ్రామానికి చెందిన చిరసాని వెంకటేశ్వరరెడ్డి, చిరసాని తేజస్వి దివాకర్ రెడ్డి, కాటేపల్లి కేశవరావుల ఆధ్వర్యంలో శుక్రవారం రూ.లక్షన్నర విలువ చేసే కేజీన్నర వెండితో తయారు చేసిన వెండిపల్లెంను సమర్పించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. దాతలను ఆలయ మర్యాదలతో, వేద ఆశీర్వచనాలు నిర్వహించి, శేషవస్త్రాలు అందజేసి ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయకులు కె.శ్రీనివాసరావు, మోదుగుల శంకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం ప్రజలకు సుదర్శన చక్రం

వేమూరు, జూలై 19 : సమాచార హక్కు చట్టం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ చట్టం సుదర్శన చక్రం లాంటిదని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ చావలి సునీల్ ఉత్తర్వుల మేరకు వేమూరులోని రోశయ్య మీటింగ్ హాలులో శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి సునీత అధ్యక్షతన జరిగిన సమాచార హక్కు చట్టంపై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. సునీత మాట్లాడుతూ భారతీయ పౌరులందరికి సమాచారం పొందే హక్కు ఉందన్నారు. సదస్సులో ఎంపీడీవో శేషగిరిరావు, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, మండల రెవెన్యూ, ఉపాధి శాఖ మండల సమాఖ్య, సచివాలయాల సిబ్బంది, పలు గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

● అమృతలూరు, జూలై 19 : సమాచారం హక్కు చట్టంను సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో స్వరూపారాణి మాట్లాడుతూ సమాచార హక్కు ద్వారా ఎవరైనా సమాచారం అడిగితే అది సహేతుకంగా ఉంటే ఇవ్వాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శివయ్య, ఎంఈవో రమేష్, ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, హెచ్.నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జులై 19 : మండలంలోని రైతులకు సమాచార హక్కు చట్టంపై శుక్రవారం మండల స్థాయి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ చట్టం రాజస్థాన్‌లోని రైతుల పోరాటాల ఫలితంగా వచ్చిందని రైతుల నుంచి వచ్చిన చట్టంపై వ్యవసాయం ద్వారా రైతాంగానికి అవగాహన కల్పించడం అభినందనీయమని రీసోర్స్‌పర్సన్‌లు పడవల కిషోర్, సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో జి.మీరయ్య, ఎంఈఓ-2 ఎన్. దేవరాజ్, పశువైద్యురాలు బొర్రా రంజిత, రైతు వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

● చెరుకుపల్లి, జూలై 19 : సమాచార పారదర్శకత ద్వారా ప్రజలు చైతన్యవంతులుకావాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి అన్నారు. ఆరుంబాక పంచాయతీలోని రైతుసేవా కేంద్రంలో శుక్రవారం జరిగిన సమాచారహక్కుచట్టం అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి ఏవో టి.బాలాజీగంగాధర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మీ, ఎస్ఐ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కేవీ సుబ్బమ్మ, అంగన్‌వాడీ సచివాలయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, జూలై 19 : సమాచార హక్కు చట్టం 2005పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగియుండాలని బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.లక్ష్మి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు, అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా డీసీఐసీ శాఖాధికారి ఇమానియేలు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాధాకృష్ణమూర్తి, డాక్టర్ ఉషా మాట్లాడారు. కార్యక్రమానికి పిట్టలవానిపాలెం మండల వ్యవసాయ శాఖాధికారి సీహెచ్ సత్యానంద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు, ఆయా గ్రామాల పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

వర్షం దాటికి పంట పొలాలు నీటమునక

రేపల్లె, జూలై 19 : గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వెదపెట్టిన వరిపైరు నీటమునిగింది. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రేపల్లె నియోజకవర్గంలో శుక్రవారం తెల్లవారుజామునుంచి భారీగా వర్షం కురిసింది. రైతులు తక్కువ ఖర్చుతో వరి సాగు చేద్దామనే ఉద్ధేశ్యంతో వెద సాగు ప్రారంభించారు. మొలకలు వచ్చినా పర్వాలేదు అనుకున్న సమయంలో వర్షం కొంపముంచిందంటూ రైతులు బోరునవిలపిస్తున్నారు. ఇప్పటికే రూ.10వేలుపైనే పెట్టుబడిపెట్టామని, వర్షంతో వెదపొలాలన్నీ నీటిలోనే నానుతున్నాయన్నారు. ఇదే విధంగా రెండు రోజులు ఉంటే మొలకలన్నీ నానిపోయి తిరిగి విత్తనాలు చల్లుకోవాల్సిన పరిస్థితి నెలకొందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా డ్రెయిన్‌లో నీరు ఉండటంతో నామమాత్రంగా పూడికలు తీసి అటు గుత్తేదారులు, ఇటు అధికారులు కుమ్మక్కై ప్రతిఏటా లక్షలాది రూపాయల సొమ్మును దోచుకుతింటున్నారేతప్పా రైతులకు మేలు జరిగిందంటూ ఏమీ లేదంటూ రైతన్నలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రెయిన్‌లలో మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.



నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి సోదరుడు శివప్రసాద్

హార్బర్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం

రేపల్లె, జూలై 19 : మందకొడిగా సాగుతున్న నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో ముందుకు వెళ్ళనున్నట్లు ఆయన సోదరుడు శివప్రసాద్ తెలిపారు. నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులతో, కాంట్రాక్టుదారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులకు ఆటంకాలు, సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే మంత్రి అనగాని దృష్టికి తీసుకునివెళ్ళి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, టీడీపీ నాయకులు బొమ్మిడిరామకృష్ణ, తాతా ఏడుకొండలు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం, కందిపప్పు అందిస్తాం : శివప్రసాద్

నగరం, జూలై 19 : పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రేషన్‌దారులకు కందిపప్పు, నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నగరం గ్రామంలో చౌక ధరల దుకాణం వద్ద పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్‌దారులకు కందిపప్పు, బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమిప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగాకాకుండా నూతన ప్రభుత్వం ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయటంతో పాటు పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, మాజీ ఎంపీపీ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తాతావారిపాలెంలో కొనసాగుతున్న వైద్య శిబిరం



కాలువల్లో పూడిక తీయిస్తున్న కార్యదర్శి అనూరాధ

భట్టిప్రోలు, జులై 19 : మండలంలోని సూరేపల్లి పంచాయతీ తాతావారిపాలెంలో వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామంలో ఏ గృహంలో చూసినా జ్వరపీడితులే దర్శనమిస్తున్నారు. జ్వరాలు అదుపులోకి తీసుకువచ్చేందుకు వైద్య సిబ్బంది శ్రమిస్తున్నారు. గ్రామంలో తాగునీరు కలుషితం కావడం వలనే జ్వరాలు విజృంభిస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గత పాలకులు చేసిన తప్పిదం వలనే తాగునీరు కలుషితం అయ్యిందని, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని గ్రామస్థులు వాపోతున్నారు. పంప్ హౌస్ నుంచి నేరుగా కుళాయిలకు తాగునీరు సరఫరా అవుతుందని, పంప్‌హౌస్ వద్ద నిర్వహణ పర్యవేక్షణ లేని కారణంగా ఇటువంటి పరిస్థితి నెలకొన్నదని గ్రామంలో నీటిని తాగేందుకు ప్రజలు భయపడుతున్నారని తెలిపారు. సుమారుగా గ్రామంలో 60 మంది వైరల్ జ్వరాలతో బాధపడుతూ పలు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలని స్థానికులు చెప్పారు. తక్షణమే తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని, గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె, జూలై 19 : గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్.శివశంకర్ అన్నారు. నిజాంపట్నంలోని బాలుర గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలపై శుక్రవారం ఎస్ఎఫ్ఐ బృందం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అమలవుతున్న మెనూ ప్రకారం ఆహారపదార్థాలు అందించాలని కోరారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని, గదుల్లో ఫ్యాన్‌లను అమర్చాలని కోరారు. మినరల్ వాటర్‌ప్లాంట్ పని చేయటం లేదని, తక్షణమే వాటికి మరమ్మతులు నిర్వహించి పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు బి.ప్రేమ్‌చంద్, దేవకిరణ్, ఎన్.హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు తక్షణమే నగదు చెల్లించాలి

నగరం, జూలై 19 : పోస్టాఫీసులో డబ్బులు జమచేసి మోసపోయిన ఖాతాదారులకు ప్రతి రూపాయి తిరిగి చెల్లించాలని సీపీఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మణిలాల్ అన్నారు. మండలంలోని సిరిపూడి పోస్టాఫీసు వద్ద మోసపోయిన బాధితులతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సిరిపూడి పోస్టాఫీసులో జరిగిన అవినితిపై అధికార యంత్రాంగం సరైన పద్దతిలో స్పందించి బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా స్థాయిలో పోస్టల్ అధికారులు దృష్టిసారించి ఉద్యోగిపై చర్యలు తీసుకుని ఖాతాదారులకు చెల్లించాల్సిన సొమ్మును తక్షణమే జమచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రమేష్, మోసపోయిన ఖాతాదారులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

చెరుకుపల్లి, జూలై 19 : వైసీపీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి మీడియా ప్రతినిధులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విలేకర్లను తీవ్రపదజాలంతో దూషించడాన్ని ఆయన ఖండించారు. మోదీపై తప్పుడు ప్రచారం చేస్తున్న విజయసాయిరెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ కూటమి నాయకులు మొఖమాటం రాధాకృష్ణమూర్తి, పూషడపు కుమారస్వామి, దూళ్ళ సురేష్, రాంపల్లి జగన్నాథ్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పల్లెకోన పంచాయతీలో రికార్డుల పరిశీలన

భట్టిప్రోలు, జులై 19 : మండలంలోని పల్లెకోన పంచాయితీలో అవినీతి జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై డివిజనల్ పంచాయితీ అధికారి జి. నరసింహారావు శుక్రవారం స్థానిక కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అవినీతి జరిగిన కాలంలో పని చేసిన కార్యదర్శులను పిలిపించి చెల్లింపులు, బిల్లులు, కార్యకలాపాలపై సమగ్రంగా వివరణ అడిగి నమోదు చేసుకున్నారు. పల్లెకోన పంచాయితీలో రూ. 30 లక్షల అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని పంచాయతీ కార్యదర్శులను వివరణ కోరారు. అవినీతిపై సమగ్రంగా విచారణ జరుపుతామని అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయితే సంబంధిత కార్యదర్శులు, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ నరసింహారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉషారాణి, కార్యదర్శులు కోట శ్రీనివాసరావు, రాజశేఖరరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డీఎండీ రాయపాటి మమత,లాయిడ్ ఫార్మాఎండీ విక్రమ్ నారాయణ తదితరులు

రేపు చినగంజాంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- ఆస్టర్ రమేష్‌హాస్పిటల్ డీఎండీ మమత
- ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో నిర్వహణ

మార్టూరు, జూలై 19:గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించే ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సేవాగుణమే తమకు నియోజకవర్గంలో హాస్పిటల్ బ్రాంచ్ ఏర్పాటుచేయాలనే ఆలోచన వచ్చిందని, త్వరలోనే బ్రాంచ్ ఏర్పాటుచేస్తామని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాయపాటి మమత అన్నారు. శుక్రవారం మండలంలోని ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎండీ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో నియోజకవర్గంలో మూడోసారి వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నామన్నారు. పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాంలో ఈనెల 21 ఆదివారం జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రజలకు ఐదురకాల వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా కార్డియాలజీ, న్యూరాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్,జనరల్ మెడిసిన్ తదితర విభాగాలలో ప్రముఖ వైద్యులతో పాటు 180 మంది వైద్య సిబ్బందితో సేవలను అందిస్తున్నామన్నారు. హాస్పిటల్ ఎండీ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సూచనల మేరకు కొన్ని గ్రామాలను దత్తతతీసుకొని ఆగ్రామాలలో అత్యాధునికమైన వైద్య సేవలను అందిస్తామన్నారు. పారిశ్రామికవేత్త లాయిడ్ ఫార్మా ఎండీ విక్రమ్ నారాయణ మాట్లాడుతూ రమేష్ హాస్పిటల్ నియోజకవర్గంలో వైద్య సేవలను అందించడానికి రావడానికి ఎమ్మెల్యే ఏలూరి నియోజకవర్గంలో ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలే కారణమన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టరు కార్తీక్, హాస్పిటల్ కో ఆర్డినేటరు భరత్, టీడీపీ చినగంజాం నాయకులు పొద వీరయ్య, నాయుడు హనుమంతరావు, తాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదైన కార్తీక్‌ను అభినందిస్తున్న చీరాల వాసులు

దేశాన్ని చుట్టివచ్చిన కార్తీక్‌కు అభినందనలు

చీరాల, జూలై 19 : మోటారు సైకిల్‌పై భారతదేశాన్ని నెల్లూరుకు చెందిన తుపిలి కార్తీక్ చుట్టి వచ్చారు. ఆ క్రమంలో అతని పేరు గిన్నిస్ రికార్డ్స్‌లో నమోదయ్యింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి చీరాల వచ్చిన కార్తీక్‌ను ఆయన అభిమానులు స్థానిక గడియారస్తంభం సెంటర్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ తాను నెల్లూరు నుంచి 14 ఫిబ్రవరి 2022లో దేశ పర్యటన ప్రారంభించి 6 అక్టోబర్ 2023లో ముగించానన్నారు. రోజుకు సుమారు 300 కిలోమీటర్లు తిరిగానని, ఆ క్రమంలో సంస్కృతి. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక స్థలాలు, సందర్శనీయ ప్రదేశాలను చుట్టివచ్చానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన పేరు గిన్నిస్ రికార్డ్స్‌లో నమోదయినట్లు తాజాగా తనకు అందిన వర్తమానాన్ని చూపారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ హుమయూన్ కబీర్, కౌన్సిలర్ దాసరి శ్రీనివాసులు, షేక్ సుభాని, సుబ్రమణ్యం, మోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం బయలుదేరిన సోపిరాల టీడీపీ నాయకులు

శ్రీశైలంలో మొక్కులు తీర్చుకున్న టీడీపీ నేతలు

చినగంజాం, జూలై 19 : 2024 సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ కూటమి అత్యధిక మెజార్టీ సాధించడం, పర్చూరు శాసనసభ్యులుగా ఏలూరి సాంబశివరావు విజయం సాధించడంతో సోపిరాల టీడీపీ నాయకులు శ్రీశైలంలో శుక్రవారం రాత్రి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అయిన సందర్భంగా, ఎమ్మెల్యే ఏలూరి హ్యాట్రిక్ విజయం సాధించడంతో శ్రీశైలంలోని మల్లికార్జునస్వామి వద్ద మొక్కులు చెల్లించినట్లు నాయకులు తెలిపారు. సోపిరాల గ్రామ టీడీపీ నాయకులు తుమ్మలపెంట జయరావు, సందు శ్రీనివాసరావు, ధర్మవరపు ఏసునారాయణ, నరహరి శ్రీనివాసరావు, గంటా నరసింహారావు, సిద్దం పాపారావు, గంటా అంకమ్మలు మొక్కులు తీర్చుకున్నారు.



రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జేఏసీ కన్వీనర్ నాగరాజు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బీసీ నేతలు

పర్చూరు, జూలై 19: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును శుక్రవారం టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం పర్చూరు నియోజకవర్గ యాదవ జేఏసీ కన్వీనర్ పాలేరు నాగరాజు ఆధ్వర్యంలో పలువురు బీసీ నేతలు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ అధికార ప్రతినిధి నల్లగాటి మల్లిఖార్జున నాయుడు, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఏలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చీరాలటౌన్, జూలై 19 : చీరాల మండల పరిధిలోని ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చీరాల డివిజన్ పంచాయతీ అధికారి దారా హనుమంతురావు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో సచివాలయ, ఆరోగ్య, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నీటి తొట్టిలు, సైడ్ కాలువల్లో పూడికలు, మంచినీటి చెరువులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అలాగే బ్లీచింగ్, క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఆయిల్ బాల్స్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే చెత్త సేకరణపై సెక్రటరీలు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. చెత్తను చెత్త సంపద కేంద్రాలకు మాత్రమే తరలించాలన్నారు. కేంద్రాల పరిసరాల్లో మొక్కలు పెంచాలని సూచించారు.

వాగును కమ్మేసిన చిల్లచెట్లు

ముందుకు కదలని నీటి ప్రవాహం

కొద్దిపాటి వరద వచ్చినా పంట పొలాలు ముంపు

అభివృద్ధి చేయాలని కోరుతున్న రైతులు

పర్చూరు, జూలై 19: ముళ్ళపొదలు, చిల్లచెట్లతో అడవిని తలపించేలా పర్చూరు డ్రైనేజ్ వాగు ఉంది. దీంతో నీరు ముందుకు కదలని పరిస్థితి. కొద్దిపాటి వరదలు వచ్చినా వాగు సమీపంలోని వందలాది ఎకరాల పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఏళ్లతరబడి చిల్లచెట్లు పెరిగిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వాగుల అభివృద్ధి వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో పర్చూరు వాగు పరిస్థితి అధ్వానంగా మారింది. నీరు ముందుకు కదలని విధంగా తయారైంది. గత ఏడాది వచ్చిన వరదల కారణంగా వాగు పరివాహక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లోని పంట పొలాలు ముంపునకు గురికావటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికి తోడు పర్చూరు పరిసర గ్రామాల్లో అనేక మంచినీటి చెరువులు పర్చూరు వాగు ద్వారా నింపుకోవాల్సి ఉంది. అయితే ప్రస్తుతం వాగులో చిల్లచెట్లు ముళ్ళ పొదలతో నిండిపోయి అధ్వానంగా మారింది. ఇదే వాగులోని నీటిని ఆయా గ్రామాల ప్రజలు మంచినీటి అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంది. వాగును అభివృద్ధి చేయాలని అనేకమార్లు రైతులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాగులో పెరిగిపోయిన ముళ్ల చెట్లను తొలగించటంతోపాటు వాగును అభివృద్ధి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



చిల్లచెట్లు, ముళ్ళ పొదలతో ముందుకు కదలని నీరు



అడవిని తలపిస్తున్న పర్చూరు వాగు

ధరల నియంత్రణకే ప్రత్యేక కౌంటర్లు

ఇంకొల్లు,జూలై 19 : బహిరంగ మార్కెట్లో ధరలను నియంత్రించేందుకే ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సరసమైన ధరలకే కందిపప్పు,బియ్యం అమ్మకాలు నిర్వహిస్తుందని టీడీపీ ఇంకొల్లు మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు అన్నారు. స్థానికటీడీపీ కార్యాలయం పక్కన ప్రభుత్వ స్టోరును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180లు, బీపీటీ బియ్యం రూ.55.85పైలు ఉండగా ఈ స్టోర్‌లో కేజీ కందిపప్పు కేవలం రూ.160లు, బియ్యం రూ.49లకే అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ప్రమీల, రాష్ట్ర వాణిజ్యవిభాగ ప్రధానకార్యదర్శి పాలేరు రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ గుంజి వెంకట్రావు, టౌన్ ప్రెసిడెంట్ వలేరు మార్క్, కరి శ్రీనివాసరావు, శివయ్య, జరుగుల శ్రీను, బండ్ల శ్రీను, రాజేష్ స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇంకొల్లులో ప్రభుత్వస్టోర్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూలై 19 : ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన కేంద్రాలలో తక్కువ ధరకు బియ్యం, కందిప్పు విక్రయిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక గడియారస్తంభం సెంటర్లో శుక్రవారం మిల్లర్ల సహకారంతో ఏర్పాటు చేసిన తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయించే కేంద్రాన్ని ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం కిలో రూ.49, ముడి బియ్యం కిలో రూ.48, దేశవాళీ కందిపప్పు కిలో రూ.160కు విక్రయిస్తారన్నారు. కొనుగోలుదారులు తమ ఆధార్‌కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వేటపాలెం తహసీల్దార్ కృష్ణకాంత్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సమాచార హక్కు చట్టం పౌరుల చేతిలో అస్త్రం

అద్దంకిటౌన్, జూలై 19: సమాచార హక్కు చట్టం అనేది పౌరుల చేతిలో ఉన్న అస్త్రం లాంటిది అని, ప్రజలకు ఉపయోగపడే ప్రతి సమాచారాన్ని పొందే హక్కును ఈ చట్టం కల్పిస్తుందని ప్రముఖ న్యాయవాది బత్తుల రామకోటయ్య అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్ కుమార్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో అధికారులు, సిబ్బంది, ప్రజలకు అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది రామకోటయ్య మాట్లాడుతూ సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజులలో ఇవ్వాలని, లేని పక్షంలో పైఅధికారులకు ఫిర్యాదు చేయవచ్చుఅన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి. గంగాధరరావు, డీటీ సుధారాణి, పీఆర్ ఏఈ ఎల్. వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారిణి దీప్తి, వెలుగు ఏపీఎం కోటేశ్వరరావు, ఏపీవో గాయత్రి లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, టెక్నికల్ ఏవో మేరమ్మ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరులో

పంగులూరు :పంగులూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహనా కార్యక్రమం జరుగుతుందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు.

చినగంజాంలో..

చినగంజాం : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కే.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు మండల స్థాయి అధికారులు, రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

మార్టూరులో..

మార్టూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం - 2005 పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది బత్తుల రామకోటయ్య

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

చెరుకూరు(పర్చూరు),జూలై 19: ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా డయేరియా వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని డాక్టర్ మైత్రేయి అన్నారు.కుష్ఠు సర్వే, డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బందితో ఇంటింటా సర్వే చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లతో గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మైత్రేయి మాట్లాడుతూ కుష్టును తొలిదశలో గుర్తించి తగిన చికిత్స నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. చిన్నారులకు కొద్దిపాటి వాంతులు అయిన దగ్గరలో ఉండే ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి తగిన వైద్యం పొందాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ గౌతమ్, సూపర్‌వైజర్ డి.బాబు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



చెరుకూరు గ్రామంలో డయేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చినగంజాంలో ర్యాలీ

చినగంజాం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చినగంజాం గ్రామంలో, సంతరావూరు పీహెచ్‌సీ పరిధిలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అతిసార నివారణపై శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, శుద్ధి జలాలు వినియెగించడం ద్వారా డయేరియాను నివారించవచ్చునని చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తిలు అన్నారు. డయేరియాపై ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. చినగంజాం గ్రామ ప్రధాన వీధులలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ వార్డు మెంబర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అతిసార వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి, వ్యాధి నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. చినగంజాం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, ఎంఈవో బి.అజయ్‌బాబు, వైద్యాధికారులు ఎస్. విజయభాస్కరరావు, బి.నాగేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.వాణిశ్రీ, గ్రామ కార్యదర్శి ఎ.మస్తాన్‌రావు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చినగంజాంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు

ఇంకొల్లులో

ఇంకొల్లు : వర్షాకాలంలో సీజనల్‌గా సోకే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంకొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అంజలి అన్నారు.శుక్రవారం మండలంలోని అంకిరెడ్డిపాలెం, ఇడుపులపాడు గ్రామాలలో ఇంటింటా తిరిగి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గురించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇళ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.జ్వరాలతో బాధపడేవారు ఏఎన్ఎంలను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకొని మలేరియా,డయేరియాలకు చికిత్స పొందవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కోటేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరులో

యద్దనపూడి, (మార్టూరు) : గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టరు శ్రీహర్ష అన్నారు.శుక్రవారం యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో ఫిక్స్‌డ్ డే ప్రోగ్రాం లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యసిబ్బంది ఇంటింటా తిరుగుతూ ప్రజల ఆరోగ్యంపై విచారణ చేశారు. ఈసందర్భంగా నీటి కలుషితవ్యాధులైన కలరా, టైఫాయిడ్, విరోచనాలు, పచ్చకామెర్లు లాంటి వ్యాధులు రాకుండా ప్రజలు పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు.అదే విధంగా వారానికి మించి నిల్వఉన్న నీటిని తాగరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో టి. శివ ప్రసాద్, ఎస్‌కె షర్మిల, కె. శివనాగరాణి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధురాలి ఆరోగ్యం గురించి విచారిస్తున్న వైద్యాధికారి శ్రీహర్ష

శాకాంబరీ దేవిగా అమ్మవారు

కారంచేడు(పర్చూరు), జూలై 19: శాకాంబరీ దేవి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కారంచేడు గ్రామంలోని వైష్ణవీ దుర్గా మాత అలయంలో అమ్మవారు శాకాంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రక రకాల కూరగాయలు పండ్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామంలోని ప్రజలు సుఖశాంతులతో వర్థిల్లాలని పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



వివిధ రకాల కూరగాయలతో దుర్గాదేవికి అలంకరణ

బాబు వద్ద జగన్ ఆటలు సాగవు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, జూలై19: సీఎం చంద్రబాబు నాయుడు వద్ద జగన్ ఆటలు సాగవని తెలుసుకోవాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో వ్యక్తిగత కక్షలతో హత్య జరిగితే దానిని ప్రభుత్వానికి ఆపాదిస్తారా అని గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వివాదాన్ని రెచ్చగొట్టేందుకు వైసీపీ అధినేత జగన్ వినుకొండలో పర్యటిస్తున్నారన్నారు. హత్యా రాజకీయాలకు పేటెంట్ వైసీపీదే అని విమర్శించారు. నిందితులు ఎవరైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారన్నారు.



ఈపూరుపాలెంలో టాస్క్‌ఫోర్స్ సభ్యుల పర్యటన

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 19 : చీరాల మండలం ఈపూరుపాలెం సబ్ స్టేషన్- 3 పరిధిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే స్టేషన్‌లో ఉన్న రికార్డులను నిశితంగా పరిశీలించారు. ప్రతినిధులు మాట్లాడుతూ గర్భిణుల స్థితిగతులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు లక్ష్మణ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, గర్భిణులు పాల్గొన్నారు.



ఈపూరుపాలెంలో పర్యటిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలి

మార్టూరు, జూలై19: క్రమశిక్షణతో విద్యార్థులకు ఉత్తమ విలువలతో కూడిన చదువును అందించాలని గుంటూరు ఆర్‌జేడీ బి. లింగేశ్వరరెడ్డి ప్రధానోపాధ్యాయులను కోరారు.శుక్రవారం మండలంలోని వలపర్ల జడ్పీ హైస్కూల్లో చీరాల డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు హాజరుకాగా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎం. నిర్మల అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆర్‌జేడీ విద్యార్థుల విద్యకు సంబంధించి వివిధ పరీక్షలు, అత్యున్నత ప్రమాణాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధానాలపై పలు సూచనలు చేశారు.అనంతరం ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఎంపికకు కారణమయిన ఉపాధ్యాయులను ఆర్‌జేడీ ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా రాజరాజేశ్వరి అమ్మవారి తిరునాళ్ల

చీరాల, జూలై 19 : మండల పరిధిలోని రామకృష్ణాపురంలో శుక్రవారం బొడ్డురాయి రాజరాజేశ్వరి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన సభ


పంగులూరు, జూలై 19 : గడిచిన విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 550కి పైగా మార్కులతో పాటు ట్రిబుల్ ఐటీలో సీటు పొందిన విద్యార్థులు, ఎన్.ఎం.ఎం.ఎస్ పోటీ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థుల అభినందన సభ పంగులూరు ఉన్నత పాఠశాలలో శనివారం జరుగుతుందని యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు బి.సుబ్బారావు, నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో ఆయా పరీక్షలలో ప్రతిభ చాటిన విద్యార్థులు హాజరుకావాలని వారు కోరారు.

వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, జూలై 19: స్థానిక వెంకయ్య ఆశ్రమంలో శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి కంటి వైద్యులు కొర్రపాటి సుబ్రమణ్యం సతీమణి హరిప్రియ జన్మదినం సందర్భంగా పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమంలో కేక్ కట్‌చేయడంతో పాటు వారికి మిఠాయిలు, పండ్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు కోటేశ్వరరావు, సాంబశివరావు, డాక్టరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య

చీరాల, జూలై 19 : ఉత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థులకు తమ కళాశాలలో ఉచిత విద్య అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పొగడదండ రవికుమార్ చెప్పారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడారు. కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటాలో కూడా 50 శాతం సీట్లు విద్యార్థులకు ఉచితంగా ఇచ్చేందుకు కళాశాల యాజమాన్య ప్రతినిధి, యలమంచిలి గ్రూప్స్ సీఈవో యలమంచిలి రామకృష్ణ నిర్ణయాలను వివరించారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



పొగడదండ రవికుమార్

విత్తనం నాటే ప్రక్రియ వాయిదా వేసుకోండి

పంగులూరు, జూలై 19 : అల్ప పీడనం కారణంగా రైతాంగం పంట పొలాలలో విత్తనం నాటే ప్రక్రియ వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండగా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వెంబడి పయనిస్తున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపిందన్నారు. ఈ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఖరీఫ్ విత్తన సాగు ప్రక్రియ కొద్దిరోజులు వాయిదా వేసుకోవాలని సుబ్బారెడ్డి కోరారు.

బొడ్డువానిపాలెంలో పట్ట పగలే దొంగతనం

మేదరమెట్ల, జూలై 19: మండలంలోని బొడ్డువానిపాలెంలో పట్ట పగలే దొంగతనం జరిగింది. శుక్రవారం ఉదయం11 గంటల సమయంలో మేదరమెట్లలో ప్రైవేట్ అసుపత్రిలో నర్సుగా పని చేసే మహిళ ఇంటిలో దొంగలు ప్రవేశించారు. తలుపుగడి తీసి బీరువా పగులగొట్టి అందులో ఉన్న 5 సవర్ల బంగారు, రూ. 60 వేలు నగదు అపహరించినట్లు బాధితురాలు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని వారు పరిశీలించారు.